పోరాటం కేసీఆర్‌ది... క్రెడిట్ రేవంత్‌కా?

- మియాపూర్ భూములపై సీఎం చెప్పేవన్నీ అసత్యాలే
- శాసనసభలో భారాస విప్ కేపీ వివేకానంద ధ్వజం

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని మియాపూర్ భూములను కాపాడేందుకు కేసీఆర్ పదేళ్లపాటు న్యాయ పోరాటం చేస్తే... సుప్రీంకోర్టు తీర్పు వెలువడగానే ఆ ఘనతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఖాతాలో వేసుకోవడం విడ్డూరమని శాసనసభలో భారాస విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ... "నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ కొనసాగించిన న్యాయపోరాటానికి ప్రస్తుతం ఫలాలు వస్తుంటే.. తానే రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను కాపాడానంటూ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకొంటున్నారు. భూముల విషయమై

- మిగతా 5లో...

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

తపాలా సేవల్లో నూతన అధ్యాయం..!
ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్లకు శ్రీకారం..!

ఐడీపీ జీడిమెట్లలో "ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్"ను ఎస్‌పి సంపత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం..!

- ఇకపై నాలుగు సబ్ పోస్టాఫీసుల డెలివరీ సేవలు ఒకే కేంద్రం నుంచి..
- సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని ఐడీపీ జీడిమెట్లలో ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ ప్రారంభం..
- 31.10.2026 నుంచి నాలుగు సబ్ పోస్టాఫీసుల డెలివరీ సేవలు ఒకే కేంద్రం పరిధిలోకి..!
- ఐడీపీ జీడిమెట్ల, కైలాష్ హిల్స్ కాలనీ, హెచ్‌ఎంటీ టౌన్‌షిప్, సుచిత్ర జంక్షన్ పోస్టాఫీసుల అనుసంధానం..!
- ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలతో ఆధునికీకరించిన డెలివరీ బీట్ల నిర్వహణ..!
- ఉత్తరాలు, పార్సిళ్లు తప్పుదారి పట్టకుండా, పంపిణీలో జాప్యాలు తగ్గించడమే ప్రధాన లక్ష్యం..

-4లో

డి.విజయేందర్ రెడ్డి..
మేడ్చల్ జిల్లా అదనపు
కలెక్టర్(పౌర సరఫరాలు)..

ఊహా జనిత చిత్రం..

బియ్యం ధరలకు కళ్లెం..!

అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..!

- తెలంగాణలో బియ్యం విక్రయాలకు గరిష్ట ధరల నిర్ణయం.. కిలో బియ్యానికి ధరల పరిమితి ఖరారు..!
- బీపీటీ రూ.66, సోనా రూ.74, శ్రీరామగోల్డ్ రూ.79గా నిర్ణయం..!
- ప్రతి హోల్‌సేల్, రిటైల్ దుకాణం ముందు ధరల బ్యానర్ తప్పనిసరి పెట్టాలని ఆదేశాలు..
- అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు: అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి..

-5లో

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రాన్ని దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఈ-సిటీలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మివి మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలచుకునేలా టెక్నాలజీ, ఇన్నోవేషన్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలను అనుసంధానిస్తూ కాంప్రహెన్సివ్ ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 2025-26లో రాష్ట్ర తయారీ రంగం 7.7 శాతం వృద్ధి రేటు నమోదు

- మిగతా 5లో...

జిట్ నోటిఫికేషన్ లేకుండా రిజిస్ట్రేషన్లు నిలిపేయొద్దు

11 ఏళ్ల వివాదంపై హైకోర్టు తీర్పు

హైదరాబాద్ పెన్ పవర్: గెజిట్ నోటిఫికేషన్ లేకుండా రిజిస్ట్రేషన్‌లను నిలిపివేసే అధికారం రిజిస్ట్రార్‌లకు లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. కేవలం అధికారులు రాసిన అంతర్గత లేఖల ఆధారంగా రిజిస్ట్రేషన్‌లను నిలిపివేసే అధికారం లేదని పేర్కొంది. నల్గొండ జిల్లా చింతపల్లి గ్రామంలోని సర్వే నెం.556, 557, 558, 585లోని భూములకు రిజిస్ట్రేషన్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ 2015లో దాఖలైన 4 పిటిషన్‌లపై జస్టిస్ యారా రేణుక విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరించారు. పిటిషనర్లు సమర్పించిన సెత్వార్, పహాణిలు, ఓఆర్‌సీ, ఎన్వోసీ, పట్టాదారు పాస్‌పుస్తకాల్లో వారి పేర్లు ఉన్నాయని, రెవెన్యూ రికార్డుల్లో వివరాలు కొన్ని భిన్నంగా ఉన్నాయని, అయితే కేవలం అంతర్గత లేఖల ద్వారా రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయడం సరికాదన్నారు. రిజిస్ట్రేషన్‌ల చట్టంలోని సెక్షన్ 22ఎ కింద నిషేధిత ఆస్తులుగా పరిగణించాలంటే చట్టం నిర్దేశించిన ప్రక్రియను అనుసరించాల్సిందేనన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించకుండా దేవాదాయశాఖ అధికారులు రాసిన లేఖల ఆధారంగా రిజిస్ట్రేషన్‌లను తిరస్కరించడం చెల్లదన్నారు. అవి గట్టుపతి వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములని దేవాదాయశాఖ భావిస్తే దేవాదాయశాఖ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి హక్కులు పొందొచ్చని పేర్కొన్నారు. అయితే భూములపై హక్కులను ఈ కోర్టు నిర్ణయించజాలదని, నోటిఫికేషన్ జారీ చేయకుండా నిషేధిత జాబితాలో చేర్చకుండా రిజిస్ట్రేషన్‌లను నిరాకరించడం చెల్లదని మాత్రమే స్పష్టం చేస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. చట్టప్రకారం ఇతర అన్ని ఆధారాలున్నట్లయితే రిజిస్ట్రేషన్‌లను కొనసాగించాలంటూ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

తుడుము పద్మారావు.. దుండిగల్ మాజీ వైస్ చైర్మన్.. ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ సెల్ గౌరవ అధ్యక్షుడు..

జీడిమెట్ల ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ సంక్షేమ సంఘం..!
గౌరవ అధ్యక్షుడిగా తుడుము పద్మారావు..!

-కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్మికులకు హామీ..!

- జీడిమెట్ల ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు..
- గౌరవ అధ్యక్షుడిగా దుండిగల్ మాజీ వైస్ చైర్మన్ తుడుము పద్మారావు నియామకం..
- సంఘం అధ్యక్షుడిగా స్వామి నాయక్‌కు బాధ్యతలు..!
- డిపో మేనేజర్ ఆంజనేయులు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పద్మారావు..
- అనంతరం తుడుము పద్మారావును శాలువాతో సన్మానించి అభినందించిన ఆర్టీసీ కార్మికులు..
- కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని పద్మారావు హామీ..

-4లో

జీడిమెట్ల ఆర్టీసీ కార్మికులతో కలిసి, డిపో మేనేజర్ ఆంజనేయులును కలవడానికి వెళ్తున్న పద్మారావు..

తుడుము పద్మారావు.. దుండిగల్ మాజీ వైస్ చైర్మన్.. ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ సెల్ గౌరవ అధ్యక్షుడు..

జీడిమెట్ల ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ సంక్షేమ సంఘం..! గౌరవ అధ్యక్షుడిగా తుడుము పద్మారావు..!

-కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్మికులకు హామీ..!

- జీడిమెట్ల ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు..
- గౌరవ అధ్యక్షుడిగా దుండిగల్ మాజీ వైస్ చైర్మన్ తుడుము పద్మారావు నియామకం..
- సంఘం అధ్యక్షుడిగా స్వామి నాయక్‌కు బాధ్యతలు..!
- డిపో మేనేజర్ ఆంజనేయులు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పద్మారావు..
- అనంతరం తుడుము పద్మారావును శాలువాతో సన్మానించి అభినందించిన ఆర్టీసీ కార్మికులు..
- కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని పద్మారావు హామీ..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 31:
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, జీడిమెట్ల డిపో కమిటీ నూతన కార్యవర్గంలో దుండిగల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తుడుము పద్మారావుకు కీలక బాధ్యతలు దక్కాయి. ఆయనను సంఘం గౌరవ అధ్యక్షుడిగా నియమిస్తూ కమిటీ నిర్ణయం తీసుకుంది.. ఈ సందర్భంగా శనివారం తుడుము పద్మారావు జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆర్టీసీ కార్మికులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.. ఈ సందర్భంగా తుడుము పద్మారావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గౌరవ అధ్యక్షుడిగా నియమించిన సంఘం నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.. కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వారి సూచనలు, సలహాలతో పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి, కార్మికుల హక్కులు, సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.. కార్యవర్గంలో అధ్యక్షుడిగా స్వామి నాయక్‌తో పాటు చీఫ్ అడ్వైజర్‌గా బి. పద్మారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. వెంకటేశం, చైర్మన్‌గా ఎం.డి., కో-చైర్మన్‌గా ఏ. అన్నమయ్యతో పాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఇతర కమిటీ సభ్యులకు బాధ్యతలు కల్పించారు.. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.ఎల్. స్వామి నాయక్, సంఘం నాయకులు, కమిటీ సభ్యులు, ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీడిమెట్ల డిపో వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద తుడుము పద్మారావును సత్కరించిని కార్మికులు..

జీడిమెట్లలో ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ ప్రాంభిస్తున్న ఏఎస్‌పి సంపత్ రెడ్డి..

జీడిమెట్ల తపాలా కార్యాలయం అధికారులు..

తపాలా సేవల్లో నూతన అధ్యాయం..! ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్లకు శ్రీకారం..!

ఐడీఏ జీడిమెట్లలో "ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్"ను ఏఎస్‌పి సంపత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం..!

- ఇకపై నాలుగు సబ్ పోస్టాఫీసుల డెలివరీ సేవలు ఒకే కేంద్రం నుంచి..
- సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని ఐడీఏ జీడిమెట్లలో ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ ప్రారంభం..
- 31.10.2026 నుంచి నాలుగు సబ్ పోస్టాఫీసుల డెలివరీ సేవలు ఒకే కేంద్రం పరిధిలోకి..!
- ఐడీఏ జీడిమెట్ల, కైలాష్ హిల్స్ కాలనీ, హెచ్‌ఎంటీ టౌన్‌షిప్, సుచిత్ర జంక్షన్ పోస్టాఫీసుల అనుసంధానం..!
- ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలతో ఆధునికీకరించిన డెలివరీ బీట్ల నిర్వహణ..!
- ఉత్తరాలు, పార్సిళ్లు తప్పుదారి పట్టకుండా, పంపిణీలో జాప్యాలు తగ్గించడమే ప్రధాన లక్ష్యం..

ఆధునిక వాహనాలతో డెలివరీ బీట్లు..

తపాల శాఖ డెలివరీ వ్యవస్థలో సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ కేంద్రం కేంద్రంని అన్ని డెలివరీ బీట్లను ఆధునికీరించారు. మెకనైజ్డ్ బీట్ల విధానంలో భాగంగా పోస్టుమెన్లు, పోస్ట్‌వుమెన్లు ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాల ద్వారా ఉత్తరాలు, పార్సిళ్లను వినియోగదారుల చిరునామాలకు చేరవేయనున్నారు.. తపాలా వస్తువులు తప్పుదారి పట్టడం, తప్పుగా వర్గీకరించబడటం, వంటి సమస్యలను తగ్గించడంతో పాటు, పంపిణీ ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించడం ఈ విధానం ప్రధాన లక్ష్యంగా తపాలా శాఖ పేర్కొంటోంది.. ఒకే కేంద్రం నుంచి సమన్వయంతో డెలివరీ నిర్వహించడం ద్వారా సేవల్లో వేగం, సామర్థ్యం పెరుగుతాయని భావిస్తోంది.. ఈ నేపథ్యంలో ఐడీఏ జీడిమెట్ల ఐడిసి పరిధిలోకి వచ్చే ప్రాంతాల ప్రజలు నూతన డెలివరీ విధానానికి సహకరించాలని తపాలా శాఖ విజ్ఞప్తి చేసింది..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 31:
భారత తపాలా సేవలను మరింత వేగవంతం చేయడంతో పాటు, ఉత్తరాలు, పార్సిళ్ల పంపిణీలో ఎదురవుతున్న జాప్యాలు, పొరపాట్లను నివారించేందుకు భారత తపాలా శాఖ కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సమీప ప్రాంతాల్లోని పలు సబ్ పోస్టాఫీసుల డెలివరీ కార్యకలాపాలను ఒకే కేంద్రం కిందకు తీసుకువచ్చే ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ (ఐడిసి) విధానాన్ని అమలు చేస్తోంది.. ఈ నూతన విధానంలో భాగంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని ఐడీఏ జీడిమెట్ల-500055 వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ 2026 అక్టోబర్ 31 నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుంది.. ఇప్పటివరకు వేర్వేరు సబ్ పోస్టాఫీసుల ద్వారా నిర్వహిస్తున్న డెలివరీ సేవలను ఇకపై ఈ ఉమ్మడి కేంద్రం నుంచే చేపట్టనున్నారు.. దీంతో పాటు తపాల సేవలు ఆధునీకరణ వైపు అడుగులు వేస్తూ నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.. ఐడీఏ జీడిమెట్ల ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ పరిధిలోకి నాలుగు సబ్ పోస్టాఫీసులను అనుసంధానించారు. వాటిలో ఐడీఏ జీడిమెట్ల, కైలాష్ హిల్స్ కాలనీ, హెచ్‌ఎంటీ టౌన్‌షిప్, సుచిత్ర జంక్షన్ సబ్ పోస్టాఫీసులు ఉన్నాయి.. ఈ కార్యాలయాలకు సంబంధించిన ఉత్తరాలు, పార్సిళ్ల పంపిణీ బాధ్యతలను అక్టోబర్ 31(నిన్నటి) నుంచి ఉమ్మడి కేంద్రం నిర్వహించనుంది.. ఈ కేంద్రం ఐడీఏ జీడిమెట్లలోని ప్లాట్ నెంబర్ 21-472, ఏపీఐఐసీ కాలనీ, ఐడీఏ జీడిమెట్ల - 500055 చిరునామాలో పనిచేయనుంది..

డి.విజయేందర్ రెడ్డి..
మేడ్చల్ జిల్లా అదనపు
కలెక్టర్(పౌర సరఫరాలు)..

ఊహా జనిత చిత్రం..

బియ్యం ధరలకు కళ్లెం..!

అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..!

- తెలంగాణలో బియ్యం విక్రయాలకు గరిష్ట ధరల నిర్ణయం.. కిలో బియ్యానికి ధరల పరిమితి ఖరారు..!
- బీపీటీ రూ.66, సోనా రూ.74, శ్రీరామగోల్డ్ రూ.79గా నిర్ణయం..!
- ప్రతి హోల్‌సేల్, రిటైల్ దుకాణం ముందు ధరల బ్యానర్ తప్పనిసరి పెట్టాలని ఆదేశాలు..
- అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు: అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి..

నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరలు ఇవే:

- తెలంగాణ బీపీటీ బియ్యం కిలో రూ.66.
- తెలంగాణ సోనా బియ్యం కిలో రూ.74.
- తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం కిలో రూ.79.
- హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు నిర్ణయించిన ధరలకు మించి విక్రయించరాదు..
- ప్రతి దుకాణం ముందు ధరల వివరాలతో కూడిన బ్యానర్ ప్రదర్శించాలి..!
- అధిక ధరలు వసూలు చేస్తే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 31:
తెలంగాణ రాష్ట్రంలో బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రోజురోజుకూ బియ్యం ధరల విషయంలో వినియోగదారులపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించడంతో పాటు, మార్కెట్‌లో వివిధ రకాల బియ్యాన్ని విక్రయించే వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించకుండా కట్టడి చేసేందుకు గరిష్ట విక్రయ ధరలను ఖరారు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.. ఈ నిర్ణయం ప్రకారం తెలంగాణ బీపీటీ బియ్యం కిలో గరిష్ట ధర రూ.66గా, తెలంగాణ సోనా బియ్యం కిలో రూ.74గా, తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం కిలో రూ.79గా నిర్ణయించారు. రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైల్ వ్యాపారులు ఈ ధరలకు మించకుండా బియ్యాన్ని విక్రయించాలని, మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన హెచ్చరించారు.

వ్యాపారుల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట..!

సాధారణంగా ఒకే రకమైన బియ్యం వివిధ దుకాణాల్లో వేర్వేరు ధరలకు విక్రయించడం, వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేయడం వంటి అంశాలకు అడ్డుకట్ట వేసే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.. ముఖ్యంగా బియ్యం కొనుగోలు చేసే సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు నిర్ణయించిన ధరలకే సరుకులు అందుబాటులో ఉండేలా వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.. మిల్లుల నుంచి హోల్‌సేల్ డిపోల వరకు, అక్కడి నుంచి రిటైల్ దుకాణాల వరకు ఈ ధరల నిర్ణయాన్ని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు..

దుకాణాల ముందు ధరల బ్యానర్లు తప్పనిసరి..

ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.. ప్రతి రిటైల్, హోల్‌సేల్ బియ్యం వ్యాపారి తమ దుకాణం ముందు నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేసే బ్యానర్‌ను ప్రదర్శించాలని అధికారులు ఆదేశించారు. తద్వారా వినియోగదారులకు బియ్యం రకాలు, వాటి గరిష్ట విక్రయ ధరలపై ముందుగానే అవగాహన కలుగుతుందని, అధిక ధరలు వసూలు చేసే వ్యాపారులను గుర్తించడం కూడా సులభతరమవుతుందని భావిస్తున్నారు.. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరలకు విరుద్ధంగా బియ్యం విక్రయించినట్లు తనిఖీల్లో తేలితే, వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందినా..! సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (పౌర సరఫరాలు) డి.విజయేందర్ రెడ్డి హెచ్చరించారు.. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని, వ్యాపారులందరూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరల నియంత్రణ నిర్ణయం ఎంతవరకు క్షేత్రస్థాయిలో అమలవుతుందా..? వ్యాపారులు బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారా..? నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయిస్తున్నారా..? అన్నది అధికారుల పర్యవేక్షణపై ఆధారపడి ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో అధిక ధరలు పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చలు మొదలయ్యాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.. పేద, మధ్యతరగతి కుటుంబాలు భయాందోళనకు గురవుతున్న సందర్భాలు కూడా, రాష్ట్ర ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ

-3 పేజీ తరువాయి

చేసిందని చెప్పారు. రాష్ట్ర పారిశ్రామిక స్థూల విలువ జోడింపు (జీఎస్‌వీఏ)లో తయారీ రంగం వాటా రూ.1.37 లక్షల కోట్లకు చేరిందన్నారు. చిప్ డిజైన్, సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తిలోనూ తెలంగా ణను ముందంజలో నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఇయర్ బడ్స్, హెడ్‌ఫోన్లు, స్పీకర్లు, సౌండ్ బార్లు తదితర ఆడియో ఉత్పత్తులను తయారు చేసే హైదరాబాద్‌కు చెందిన మివి సంస్థ తాజాగా 5జీ స్మార్ట్‌ఫోన్ మొబైల్ తయారీ రంగంలోకి అడుగు పెట్టిందన్నారు.ం కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మివి ప్రతినిధులు విశ్వనాథ్ కందుల, మిధుల దేవభక్తుని తదితరులు పాల్గొన్నారు.

పోరాటం కేసీఆర్‌ది... క్రెడిట్ రేవంత్‌కా?

-3 పేజీ తరువాయి

ఆయన చెప్పేవన్నీ అబద్ధాలే.మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు ప్రతులు చేతికి రాకముందే వాటిని విక్రయిస్తామని ప్రకటించడం వెనక అంతర్యమేమిటి? భూముల అమ్మకానికి ఇప్పటికే అడ్వాన్సులు తీసుకున్నారేమోననే అనుమానాలు వస్తున్నాయి. కేసీఆర్ కష్టపడి కాపాడిన భూములను అడ్డగోలుగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే మెట్రో భూములను కాజేసేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర చేశారు. హిల్ట్ పాలసీతో భూదందాకు తెరలేపారు. ఆయా భూముల విక్రయాలపై భారాస అధికారంలోకి వచ్చాక విచారణ చేయిస్తాం” అని స్పష్టంచేశారు. అనంతరం ఎమ్మెల్యే డా.సంజయ్ మాట్లాడుతూ... అబద్ధాలు చెప్పడంలో, కుటుంబ సభ్యులకు భూములను కట్టబెట్టడంలో రేవంత్‌రెడ్డి గొప్పవారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మియాపూర్ భూముల పరిరక్షణకు న్యాయవాదులను నియమించి పోరాడారని ఆయన గుర్తుచేశారు.

అడ్డూ, అదుపు లేకుండా పెరుగుతున్న బియ్యం...

హైదరాబాద్, అక్టోబరు 31, పెన్ పవర్:
తెలంగాణలో ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలతో అల్లాడుతున్న సామాన్యుడిని ఆదుకునే క్రమంలో.. సాధారణ ప్రజలు విస్తృతంగా వినియోగించే బీపీటీ రకం బియ్యం ధర కిలో రూ. 66 మించకూడదంటూ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మార్కెట్లో ప్రీమియం, సన్నబియ్యం ధరలు క్వింటాళ్లకు వేల రూపాయలు ఎగబాకి, కిలో రూ. 90 నుంచి రూ. 100 దాకా పలుకుతూ మధ్యతరగతి జేబులకు చిల్లులు వేస్తున్న వేళ.. ప్రభుత్వం కఠిన హెచ్చరికలు జారీ చేయడం ఊరటనిచ్చే అంశం. అయితే, గతంలోనూ ధరల నియంత్రణపై ఎన్నోసార్లు ఇలాంటి సమీక్షలు, గంభీర ప్రకటనలు వచ్చినప్పటికీ.. క్షేత్రస్థాయి రిటైల్ దుకాణాల్లో వ్యాపారులు వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా యథేచ్ఛగా దోపిడీ సాగించిన చేదు అనుభవాలు ఉన్నాయి. ఈసారి కేవలం మాటలతో సరిపెట్టకుండా పౌరసరఫరాలు, పోలీసు, జీఎస్టీ, లీగల్ మెట్రాలజీ వంటి ఐదు విభాగాలతో సంయుక్త తనిఖీలు చేపట్టడం, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ వంటి ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లలో దాడులు చేసి 12 కేసులు నమోదు చేయడం ప్రభుత్వ సీరియస్‌నెస్‌ను సూచిస్తోంది. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లకు తరలించే మిల్లర్లు, హోల్‌సేలర్ల నెట్‌వర్క్‌ను గుర్తించి చర్యలు తీసుకోవడం మంచి పరిణామమే. అయితే, ఈ దాడులు కేవలం పెద్ద హోల్‌సేల్ మండీల వద్ద ఫోటోషూట్‌లకే పరిమితమైతే ఫలితం శూన్యం. నగరాలు, పట్టణాలు, పల్లెల్లో ఉండే చిన్న చిన్న కిరాణా షాపులు, రిటైల్ మార్కెట్ల దాకా నిరంతర నిఘా ఉంటేనే ఈ రూ. 66 ధరల పరిమితి ప్రజలకు వాస్తవంగా ఉపయోగపడుతుంది. రాష్ట్రంలో సరిపడా ధాన్యం నిల్వలు ఉన్నాయని, వినియోగదారులు భయాందోళనలకు గురై పెద్ద ఎత్తున నిల్వ చేసుకోవద్దని మంత్రి ధైర్యం చెబుతున్నప్పటికీ.. కొరత భయాన్ని తొలగించాల్సింది కేవలం మాటలతో కాదు, మార్కెట్ స్థిరీకరణతోనే. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని, వాటిని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆ బియ్యం పంపిణీ నాణ్యత, సరఫరా గొలుసులో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత కూడా పౌరసరఫరాల శాఖపైనే ఉంది. రేషన్ బియ్యం నాణ్యతపై ప్రజల్లో నమ్మకం పెంచితే తప్ప ఓపెన్ మార్కెట్ బియ్యంపై ఆధారపడటం తగ్గదు. ఆర్ఎన్ఆ రకాల ధరలను కూడా సమీక్షిస్తామని చెబుతున్న సర్కారు.. కేవలం ఒకే రకంపై కాకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న ఇతర నాణ్యమైన బియ్యం రకాలపై కూడా స్పష్టమైన ధరల పట్టికను అమలు చేయాల్సి ఉంది. టాస్క్‌ఫోర్స్ తనిఖీలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలన్న సూచనలు వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే బడా మిల్లర్ల లైసెన్సులు రద్దు చేయడం, అక్రమ నిల్వలను సీజ్ చేసి బహిరంగ మార్కెట్లలో రీజనబుల్ ధరకు అమ్మేలా చేయడం వంటి కఠిన చర్యలు చేపడితేనే వ్యాపారుల్లో భయం పుడుతుంది. అలా కాకుండా ఒకట్రెండు రోజుల హడావుడి తర్వాత తనిఖీలు చల్లబడితే.. వ్యాపారులు మళ్లీ కృత్రిమ కొరత సృష్టించి మరింత ఎక్కువ ధరలకు విక్రయించే ప్రమాదం ఉంది. పాలకుల చిత్తశుద్ధి ప్రభుత్వ ఆదేశాల జారీలో కాదు.. గల్లీలోని కిరాణా కొట్టులో సామాన్య వినియోగదారుడు సంచిలో బియ్యం పోయించుకునేటప్పుడు కనిపించే ధరలోనే ప్రతిబింబిస్తుందన్న నిజాన్ని ప్రభుత్వం విస్మరించకూడదు.

నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి జీఎస్ఎల్వీ-ఎఫ్18

శ్రీహరికోట, అక్టోబరు 31, పెన్ పవర్:
భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ఒక భారీ రాకెట్‌ను ప్రయోగించి విజయవంతమైంది. జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్, 2026 అక్టోబర్ 30వ తేదీన రాత్రి 11:51 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 అనే నావిగేషన్ ఉపగ్రహాన్ని మోసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ ఉపగ్రహం భారతదేశపు నావిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది. జీఎస్ఎల్వీ రాకెట్ తన 20వ ప్రయోగం. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం రెండవ లాంచ్ ప్యాడ్ నుండి ప్రవేశపెట్టిన ఇస్రో.. మూడు దశల్లో ప్రవేశపెట్టి సక్సెస్ చేసింది. దీంతో ఇస్రోలో శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు. చీమా-03 2232 బరువుగల శాటిలైట్ ను నింగిలోకి మోసుకెళ్లింది. భారత్ సొంతంగా తయారు చేసుకున్న నావిగేషన్ వ్యవస్థను బలోపేతానికి చీమా-03ని ప్రయోగించింది. ఈ ఉపగ్రహం13 ఏళ్ల పాటు కక్షలో పని చేయనుంది. చీమా-03 అనేది రెండవ తరం నావిక్ ఉపగ్రహాలలో మూడవది. దీనికి స్వదేశీంగా తయారు చేసిన అటామిక్ క్లాక్, కొనుగోలు చేసిన అటామిక్ క్లాక్‌ను అమర్చారు. మునుపటి ఉపగ్రహాలలో ఎల్5 , ఎస్ సిగ్నల్స్ ఉండేవి. ఇప్పుడు కొత్తగా ఎల్1 సిగ్నల్‌ను జోడించారు. ఇది నావిగేషన్‌ను మరింత మెరుగుపరుస్తుంది. ఈ ఉపగ్రహం భారతదేశ భూభాగం, దాని చుట్టూ 1,500 కిలోమీటర్ల వరకు ఉన్న ప్రాంతానికి కచ్చితమైన ప్రదేశం, వేగం, సమయ సమాచారాన్ని అందిస్తుంది. నావిక్ అనేది భారతదేశపు సొంత నావిగేషన్ వ్యవస్థ. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. ఒకటి సాధారణ ప్రజల కోసం ఉద్దేశించిన 'స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్', మరొకటి ప్రత్యేక ప్రయోజనాల కోసం ఉద్దేశించిన 'రెస్ట్రిక్టెడ్ సర్వీస్'. ఇస్రో మొత్తం ఐదు సెకండ్ జనరేషన్ ఉపగ్రహాలను నిర్మించాలని యోచిస్తోంది. ఇస్రో 2023 మే 29న జీఎస్ఎల్వి-ఎఫ్12 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-01ను అంతరిక్షంలోకి ప్రయోగించింది. ఇది మొట్టమొదటి స్వదేశీ అణు గడియారాన్ని మోసుకెళ్లింది. ఇప్పుడు ఈ రోజు ప్రయోగించిన కొత్త ఉపగ్రహం ఎన్వీఎస్-03, ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. ఈ వ్యవస్థ వాహన నావిగేషన్, లొకేషన్ సేవలు, ఇతర ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఇది ఒకప్పుడు ఇతర దేశాల వ్యవస్థలపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. అందువల్ల ఈ రాత్రి జరిగే ఇస్రో ఉపగ్రహ ప్రయోగం దేశానికి చాలా కీలకం.

గార్ల్స్ హాస్టల్ అడ్డగా... అండాల సేకరణ...

హైదరాబాద్, అక్టోబరు 21, పెన్ పవర్:
అది పేరుకే లేడీస్ హాస్టల్.. చేసేది అండాల బిజినెస్.. బేగంపేట ప్రకాష్‌నగర్‌లో బయటపడ్డ అండాల అక్రమ దందా.. హైదరాబాద్‌లో గర్ల్స్ హాస్టల్ పేరుతో నడుపుతున్న గలీజ్ దందా గుట్టురట్టు అయింది. బేగంపేటలో యువతుల అండాల సేకరణ ముఠా వ్యవహారం బట్టబయలు అయింది. బేగంపేట పోలీసులు, ఎస్ఓటీ పోలీసుల సంయుక్తంగా దాడుల్లో 10మంది యువతులు అడ్డంగా బుక్కవడం కలకలం రేపుతోంది. హైదరాబాద్ బేగంపేటలో యువతుల అండాల అక్రమ సేకరణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రకాష్‌నగర్‌లోని నజ్రాన్ అపార్ట్‌మెంట్‌లో గలీజ్ వ్యవహారం సాగుతున్నట్టు ఆరోపణలు రావడంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. అర్ధరాత్రి 2గంటల సమయంలో బేగంపేట పోలీసులు, ఎస్ఓటీ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ దారుణ వ్యవహారం బయటపడింది. పోలీసులకు 10మంది యువతులు పట్టుబడటం సంచలనం రేపింది. వీరిని బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశాకు చెందిన యువతులుగా గుర్తించి.. అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఏడాదికాలంగా అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరుతో ఈ అక్రమ అడ్డగోలు కార్యకలాపాలు సాగిస్తున్నట్టు పోలీసుల ప్రాథమిక
విచారణలో తేలింది. ఈ క్రమంలోనే.. అండాల సేకరణతో పాటు సంతాన సాఫల్య కేంద్రాలతో సంబంధాలపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. యువతుల నుంచి అండాలను సేకరించి సమీపంలోని సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళల అండాలతో పాటు పురుషుల వీర్యకణాల సరఫరాకు సంబంధించిన దందాపైనా పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ మహిళ ప్రమేయం ఉందనే అనుమానంతో ఆమెను కూడా ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే.. అండాల అక్రమ సేకరణ, విక్రయాల వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే.. అండాల సేకరణలో యువతుల సమ్మతి ఉందా?.. డోనర్స్ విషయంలో అసలు మెడికల్ రూల్స్ పాటిస్తున్నారా?.. అండాల సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు?.. ఈ అండాలను ఏఏ ఫెర్టిలిటీ సెంటర్లకు పంపుతున్నారనే వివరాలను సేకరించే పనిలో పడ్డారు పోలీసులు.
ఇక.. ప్రకాశ్‌నగర్‌లోని అమీ నీతా గర్ల్స్ హాస్టల్‌లో ఎప్పటినుంచో చాలా మంది మహిళలు ఉంటున్నారని స్థానికులు చెప్పారు. అంతా బయట రాష్ట్రాల యువతులేనని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి పక్కన అపార్ట్‌మెంట్లో పోలీసులు దాడులు చేయడంతో ఆందోళనకు గురయ్యామన్నారు స్థానికులు. తీరా చూస్తే.. కొంతమంది యువతులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసిందని చెప్పారు. మొత్తంగా.. హైదరాబాద్‌లో మరోసారి అండాలు, వీర్యకణాల అక్రమ సేకరణ దందా గ్యాంగ్ గుట్టు రట్టయింది. గర్ల్స్ హాస్టల్ పేరుతో యువతుల అండాలను సేకరించి.. ఫెర్టిలిటీ సెంటర్లకు విక్రయిస్తున్న ముఠా బండారాన్ని బేగంపేట పోలీసులు బట్టబయలు చేయడం సంచలనంగా మారింది.

తొమ్మిది నియోజకవర్గాలకు తాగునీటి ముప్పు..

హైదరాబాద్, అక్టోబరు 31 పెన్ పవర్:
ఎల్‌నినో వర్షాభావంతో మంజీర, సింగూరు జలాశయాలు అడుగంటి, హైదరాబాద్‌లోని 9 నియోజకవర్గాల్లో నీటి ఎద్దడితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రతికూల వర్షాభావ పరిస్థితులు హైదరాబాద్ మహానగర ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. నగరంలోని ప్రధాన తాగునీటి ఆధారాలైన మంజీర, సింగూరు జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోతుండటమే దీనికి కారణం. హైదరాబాద్ సిటీ పరిధిలో మొత్తం 22 నియోజకవర్గాలు ఉండగా.. అందులో మంజీరా పైపులైన్లు ఉన్న 9 నియోజకవర్గాల్లో నీటి సమస్య తీవ్రమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నీటి ముప్పును తిప్పికొట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. హైదరాబాద్ సిటీకి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలతో పాటు మంజీరా, సింగూరు, కృష్ణా, గోదావరి జలాల నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా, జంట జలాశయాల్లో ఉన్న నీటిని రాబోయే 360 రోజులకు సరిపోయేలా జలమండలి ప్లాన్ చేసింది. సాధారణంగా సరఫరా చేయాల్సిన 40 ఎంజీడీలకు (మిలియన్ గ్యాలన్స్ పర్ డే) బదులుగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రస్తుతం 27 ఎంజీడీలను మాత్రమే అందిస్తున్నారు. సింగూరు జలాశయ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 3.029 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. మంజీరాలో 1.50 టీఎంసీలకుగాను కేవలం 0.19 టీఎంసీల నీరు ఉంది. ఈ రెండు జలాశయాల్లో కలిపి కేవలం 10 శాతం నీరు మాత్రమే ఉంది. నీటి ఆవిరి, పైపులైన్ల లీకేజీలు పోను ఈ నిల్వలు గరిష్ఠంగా మరొక 60 రోజులకు మాత్రమే సరిపోతాయని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. అందుకే ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి, అది కూడా కేవలం 45 నిమిషాల వ్యవధిలోనే నీటిని సరఫరా చేస్తున్నారు. మంజీరా ఆధారిత ప్రాంతాలైన కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, సనత్‌నగర్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. శేరిలింగంపల్లి ఐటీ కారిడార్ తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట్, బంజారాహిల్స్, సోమాజిగూడ, నార్సింగి, నిజాంపేట్ వంటి ప్రాంతాల్లో నీటి ట్యాంకర్లకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మంజీరా పైపులైన్లను గోదావరి
ఫేజ్-1తో అనుసంధానించేందుకు జలమండలి ప్లాన్ చేసింది. ఎల్లంపల్లి జలాశయంలో 20.17 టీఎంసీల సామర్థ్యానికి గాను 17.703 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకే పరిమితం చేస్తే హైదరాబాద్ సిటీకి వచ్చే ఏడాది వేసవి పూర్తయ్యేవరకు నీటి కొరత తలెత్తదు. మంజీరా పైపులైన్లను గోదావరి సరఫరా వ్యవస్థకు అనుసంధానించే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రాబోయే 2 నెలల్లో పనులు పూర్తయితే హైదరాబాద్ నగరం నీటి గండం నుంచి క్షేమంగా బయటపడుతుందని జలమండలి అధికారులు భావిస్తున్నారు. క్యూర్ పరిధిలో జనాభా 1.32 కోట్ల వరకు ఉండగా.. 14.50 లక్షల వాటర్ ట్యాప్స్ ఉన్నాయి. ప్రతిరోజూ 560 ఎంజీడీల నీటి సరఫరా జరుగుతోంది

సీజ్ చేసిన ఫోన్‌లో నగదు బదిలీ.. బంగారం తాకట్టు
మీర్పేట్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ అరెస్ట్

ఎల్బీనగర్, అక్టోబర్ 31 (పెన్ పవర్): మీర్ పేట్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్‌ను మీర్ పేట్ పోలీసులు అరెస్టు చేశారు. ఒక కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను దుర్వినియోగం చేసి, ఆన్‌లైన్ ద్వారా రూ.1.70 లక్షలను తన బంధువుల ఖాతాలకు బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, అదే కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న 12 తులాల బంగారు ఆభరణాలను సైతం తాకట్టు పెట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్

బాలల భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

హయత్‌నగర్‌లో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' అవగాహన కార్యక్రమం

ఎల్బీనగర్, పెన్ పవర్ అక్టోబర్ 31: బాలల రక్షణ, హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి ఎం.కె. పద్మావతి సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకత్వంలో, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి ఎం.కె. పద్మావతి విద్యార్థులకు బాలల హక్కులు, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం (పోక్సో చట్టం--2012), బాలల భద్రతపై అవగాహన కల్పించారు. బాలల రక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగం గౌడ్, ప్రధాన కార్యదర్శి రామ్‌మోహన్ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. లైంగిక వేధింపులను గుర్తించడం, అటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి, తమను తాము ఎలా రక్షించుకోవాలి అనే అంశాలను తెలియజేశారు. హయత్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్ పోక్సో చట్టంపై అవగాహన కల్పించగా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్ బాలల రక్షణ చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద ప్లాన్‌తోనే తెలంగాణలో అమిత్ షా

హైదరాబాద్, అక్టోబరు 31, పెన్ పవర్:
తెలంగాణ గడ్డపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేరుగా రంగంలోకి దిగి పాదయాత్రలో పాల్గొంటున్నారు. ఇందు కోసం బీజేపీ గట్టి ఏర్పాట్లు చేస్తోంది. ఈ పాదయాత్ర కార్యక్రమం ఆషామాషీ రాజకీయ పరిణామం కాదు. బీజేపీ జాతీయ వ్యూహరచనలో పశ్చిమ బెంగాల్‌ను ఒక దశలో ప్రధాన టార్గెట్‌గా ఎంచుకుని అక్కడ ఎలాగైతే కాషాయ దళాన్ని విజేతగా నిలబెట్టారో.. అదే తరహాలో తెలంగాణలోనూ జెండా పాతేలా చేయాలనుకుంటున్నారు. బెంగాల్ తర్వాత దక్షిణాదిలో బీజేపీకి తెలంగాణనే అసలైన లక్ష్యమని అమిత్ షా గతంలోనే పలుమార్లు కుండబద్దలు కొట్టారు. సాధారణంగా కేంద్ర స్థాయిలోనే వ్యూహాలు రచించే చాణక్యుడు స్వయంగా రోడ్డుపైకి వచ్చి అడుగులు వేస్తున్నారంటే, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ దూకుడును ఏ స్థాయికి తీసుకెళ్లబోతున్నారో స్పష్టమవుతోంది. ఈ భారీ రాజకీయ సమరానికి ముందుగా పార్టీలోని అంతర్గత సమస్యలను చక్కదిద్దే కసరత్తును అధిష్టానం వేగవంతం చేసింది. పార్టీ రాష్ట్ర సారథిగా బాధ్యతలు చేపట్టిన కొత్త నాయకత్వం.. నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు బహిర్గతం కాకుండా, ఆ ప్రభావం కేడర్‌పై పడకుండా ఇప్పటికే అంతర్గత సర్దుబాట్లు చేసింది. క్షేత్రస్థాయిలో ఈటల రాజేందర్, బండి సంజయ్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్ర నేతలు ఎవరికి వారు ప్రజాసమస్యలపై తమదైన శైలిలో పోరాడుతున్నప్పటికీ.. అంతిమంగా పార్టీ వేదికపైకి వచ్చేసరికి ఐక్యతను ప్రదర్శించేలా క్రమశిక్షణను నిర్దేశించారు. ఈ అంతర్గత సమన్వయం పక్కాగా కుదిరితే, నేతల వ్యక్తిగత బలాలన్నీ కలిసి పార్టీకి భారీ సంయుక్త శక్తిగా మారి మైలేజీని తెచ్చిపెడతాయన్నది పార్టీ పెద్దల అంచనా. అమిత్ షా స్వయంగా మైదానంలోకి దిగి రోడ్‌మ్యాప్‌ను అమలు చేయడం ప్రారంభిస్తే.. రాబోయే ఆరు నెలల్లో తెలంగాణ రాజకీయ సమీకరణాలు సమూలంగా మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి ప్రస్తుతం వరుస ఓటములు, అంతర్గత కుమ్ములాటలతో ఉనికిని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలైన లక్ష్యం. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి, రైతాంగ, పట్టణ సమస్యలను బీజేపీ తనవైపు తిప్పుకుని.. ప్రతిపక్ష శూన్యతను కాషాయ దళంతో భర్తీ చేయాలని ఢిల్లీ నాయకత్వం గట్టి పట్టుదలతో ఉంది. అమిత్ షా తాజా రాజకీయ ఎత్తుగడలు క్షేత్రస్థాయిలో అమలైతే.. తెలంగాణలో ప్రధాన పోరు 'బీజేపీ వర్సెస్ కాంగ్రెస్' అన్నట్లుగా పూర్తిస్థాయిలో బైపోలార్‌గా మారిపోయే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దూకుడు, ప్రజాక్షేత్రంలో అగ్రనేతల వరుస పర్యటనలు, బూత్ స్థాయి వ్యవస్థాగత బలోపేతం వంటి వ్యూహాలతో రేవంత్ ప్రభుత్వాన్ని నాలుగు వైపుల నుంచి ఉక్కిరిబిక్కిరి చేయనున్నారు. గులాబీ పార్టీ కనుమరుగై, కాంగ్రెస్‌కు ఏకైక తిరుగులేని ప్రత్యామ్నాయం బీజేపీయేనన్న బలమైన భావనను ఓటర్లలో నాటడం ద్వారా.. తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు అమిత్ షా వేసిన ఈ పాదయాత్ర స్కెచ్ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పనుందనడంలో సందేహం లేదు.

సమాజ సేవకు విరమణ లేదు

హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ నాయక్ ను సన్మానిస్తున్న ఎస్పీ శబరిష్

గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 31 పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి మాత్రమే ముగింపు అని, సేవా భావానికి కాదని, అది నిరంతరం కొనసాగాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, అన్నారు.గార్ల మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తేజావత్ శ్యామ్ (హెచ్-2085) పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరిష్ హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ శాఖలో ఆయన అందించిన సేవలు, విధి నిర్వహణలో చూపిన అంకితభావం, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరును అభినందించారు.ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ అనేది ఒక బాధ్యతాయుతమైన ప్రయాణానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని ఎస్పీ పేర్కొన్నారు. సుదీర్ఘకాలం ప్రజలకు, సమాజానికి సేవలందించిన ఉద్యోగులు తమ అనుభవాలను సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా కొనసాగించాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంతోషంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు

నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 31భారతదేశపు ఉక్కు మహిళ భారతరత్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను గార్ల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, గార్ల మండల కేంద్రంలోని స్థానిక ఇందిరానగర్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి సర్పంచ్ పార్వతీ నాయక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ నాయకురాలు శంషాద్ బేగం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు, అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరీబి హటావో అనే నినాదంతో పేద ప్రజల బతుకులు వెలుగులు నింపిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని ఆమె బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి దోహదపడ్డారని అనేక పరిశ్రమలు స్థాపించి యువతకు మార్గదర్శిగా నిలిచారని ,బ్యాంకులను జాతీయకరణ చేసి ప్రజలందరికీ చేరువ చేశారని దేశ ప్రజల గుండెల్లో భారతరత్నగా ఉక్కు మహిళగా చిరస్థాయిగా వారు నిలిచిపోతారని కొనియాడారు, ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పళ్ళ నరసయ్య మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హతిరాం నాయక్ గోపాలపురం ఉపసర్పంచ్ శ్రీనివాస్ వార్డు సభ్యులు శ్రీనివాస్ ఇమ్రాన్ రవి నాయక్ సర్వేష్ నరేష్ తదితరులు ఉన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు సాగించాలి

జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గార్ల, పెన్ పవర్, అక్టోబర్ 31: కార్మికులు దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాలరాసే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని ఏఐటీయూసీ గార్ల మండల కార్యదర్శి మెదరమెట్ల గిరిప్రసాద్ డిమాండ్ చేశారు. కార్మిక హక్కులపై జరుగుతున్న దాడులను ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గార్ల మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక గిరిప్రసాద్ భవనంలో నిర్వహించిన వేడుకల్లో మండల అధ్యక్షుడు ధూపాటి జనార్దన్ జెండా ఆవిష్కరించారు. అనంతరంఈ సందర్భంగా గిరిప్రసాద్ మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న కార్మికుల హక్కులు, గౌరవప్రదమైన జీవనం, సామాజిక న్యాయం లక్ష్యంగా ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి కార్మికుల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తూ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులకు ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మె హక్కు, సంఘటితమయ్యే హక్కు, ఉద్యోగ భద్రత, సామూహిక బేరసారాల హక్కులకు భంగం కలిగించే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో రంగ నాయకులు భూక్య పూల్‌సింగ్, బాదం రాజేష్, రాంబాబు, భవన నిర్మాణ రంగ నాయకులు తోకల పుల్లయ్య, చిటాకుల రాములు, పెయింటింగ్ రంగ నాయకులు బాసిపంగు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షుడు జంపాల వెంకన్న, తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా నాయకుడు భూక్య హరినాయక్, రైతు నాయకుడు కట్టెబోయిన పిచ్చయ్య, కార్మికులు రవి, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని బస్సుల్లో పని చేయని ఏసీ ప్రయాణికుల అవస్థలు

రాజధాని ఆర్టీసీ బస్సు

ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 31: ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు నడిచే రాజధాని ఏసీ బస్సుల్లో ఎయిర్ కండిషనర్లు పనిచేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకే రాజధాని ఏసీ బస్సులని, లోపల మాత్రం ఏసీ పనిచేయడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేద్దామంటే సంబంధిత కంప్లైంట్ నంబర్లు అందుబాటులో లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించే సమయంలో కూడా ఏసీ పనిచేయలేదని,

ఉదయం వాతావరణం చల్లగా ఉండటంతో సర్దుకుపోయామని ప్రయాణికులు తెలిపారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ బస్‌స్టాండ్ నుంచి ఎల్బీనగర్ వరకు బస్సులో ఏసీ పనిచేయకపోవడంతో తీవ్ర ఉక్కపోతకు గురయ్యామని పేర్కొన్నారు. బస్సు డోర్లు మూసి ఉండటం, ఏసీ రాకపోవడంతో లోపల ఊపిరాడని పరిస్థితి నెలకొందని, చిన్నపిల్లలు సైతం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన ఆర్టీసీ, కనీసం ఏసీ బస్సుల్లో ఏసీ పనిచేస్తుందో లేదో పరిశీలించకుండానే బస్సులను నడుపుతోందా? అని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి అనుభవాలతోనే ప్రయాణికులు ప్రైవేట్ సర్వీసుల వైపు మొగ్గు చూపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి, ఏసీ బస్సులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖమ్మం కాల్వొడ్డు నుంచి వరంగల్ క్రాస్ రోడ్డు వరకు భారీ ట్రాఫిక్.. వాహనదారులకు తప్పని తిప్పలు



భారీగా ట్రాఫిక్ జామ్

ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 31: ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు నుంచి వరంగల్ క్రాస్ రోడ్డు వరకు నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. గతంలో కేవలం పది నిమిషాల్లో చేరుకునే ప్రయాణానికి ప్రస్తుతం భారీ ట్రాఫిక్ కారణంగా దాదాపు అరగంట సమయం పడుతోంది. కార్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు భారీగా రాకపోకలు సాగిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ విపరీతంగా పెరుగుతోంది. విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. అత్యవసర పనులపై వెళ్లే వారు సైతం సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు.

ఈ ట్రాఫిక్ కష్టాలకు ముగింపు ఎప్పుడు?

గతంలో పది నిమిషాల్లో చేరుకునే ప్రయాణానికి ఇప్పుడు అరగంట పడుతుండటంతో ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఈ ట్రాఫిక్ సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుంది వాహనదారుల కష్టాలు ఎప్పుడు తీరుతాయి అధికారులు ఎప్పుడు స్పందిస్తారు అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.సంబంధిత ట్రాఫిక్ పోలీసు అధికారులు రద్దీ సమయాల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

విద్యార్థులు యువతతో ఫ్లాష్ వాక్ నిర్వహించిన జిల్లా ఎస్పీ

మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

మహబూబాబాద్, పెన్ పవర్, అక్టోబర్: 31

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా ఆగి, ఆలోచించి, నిజానిజాలు నిర్ధారించుకోవాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు. 'పాజ్ ఫర్ సేఫ్టీ.. పాజ్, థింక్, వెరిఫై' నినాదంతో సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం మహబూబాబాద్ పట్టణంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో భారీ ఫ్లాష్‌వాక్ నిర్వహించారు.జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన మాసోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా నెహ్రూ సెంటర్ నుంచి మూడు కోట్ల సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. జిల్లా ఎస్పీ డా. శబరీష్‌తో పాటు విద్యార్థులు, యువత, పట్టణ ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు టార్చ్‌లైట్లు, సైబర్ భద్రతపై అవగాహన కల్పించే ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 'సైబర్ హెల్ప్‌లైన్ 1930', 'నో డిజిటల్ అరెస్ట్' వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. పోలీసులమని, సీబీఐ, ఇతర దర్యాప్తు సంస్థల అధికారులమని ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించే వారిని నమ్మవద్దని సూచించారు. చట్టంలో డిజిటల్ అరెస్ట్ అనే విధానం లేదని స్పష్టం చేశారు. అలాంటి ఫోన్ కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.బ్యాంకు అధికారులమని చెప్పి ఫోన్ చేసినా ఎవరికీ ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని సూచించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం, ఆన్‌లైన్‌లో ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మడం వల్ల మోసపోయే ప్రమాదం ఉందన్నారు. సైబర్ మోసానికి గురైన వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.సైబర్ నేరాల నివారణ పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ రఘుపతిరెడ్డి, రూరల్ సీఐ అంజలి, సైబర్ సెక్యూరిటీ అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

యలహంక ప్రాపర్టీ వంద శాతం నాదే.. షర్మిల ట్వీట్, అన్న జగన్ రెడ్డికి కౌంటర్

బెంగుళూరులోని యలహంక ప్రాపర్టీ వంద శాతం వాటాగా వచ్చినట్లు పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అప్పటివరకు ఉమ్మడి ఆస్తిగా ఉన్న యలహంక ఇల్లు ఆస్తుల పంపకాల్లో నాకు, నా పిల్లలకు వచ్చిందని చెబుతూ షర్మిల ఎక్స్ లో పోస్టు పెట్టారు. యలహంక నివాసంలో షర్మిల కుమార్తె అంజలిరెడ్డి వివాహం చేయాలని నిర్ణయించగా, ఆమె సోదరుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సెక్యూరిటీ కారణాలు చూపుతూ అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇద్దరి మధ్య ఆస్తుల వివాదం హాట్ టాపిక్ గా మారింది. యలహంకలో అంజలిరెడ్డి వివాహానికి జగన్ అడ్డు చెబుతున్నారని వార్తలు వచ్చిన నుంచి పెద్ద రాజకీయ దుమారమే నడుస్తోంది. దీనిపై ఇంతవరకు బహిరంగంగా మాట్లాడని షర్మిల ఎక్స్ ద్వారా తొలిసారిగా స్పందించారు.

అంత నీచత్వం లేదు

తన కుమార్తె వివాహంపై సోదరుడు వైఖరి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన షర్మిల.. ట్విట్టర్ లో చేసిన ట్వీట్ లో అనేక అంశాలను ప్రస్తావించారు. "నాది కానీ దానికోసం ఆశపడే నీచత్వం నాది కాదు." అంటూ షర్మిల ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేవుడి సాక్షిగా నిజం చెబుతున్నా యలహంక ప్యాలెస్ తనదేనని షర్మిల స్పష్టం చేశారు. నాన్న వైఎస్సార్ స్వయంగా తిరిగిన ఇల్లు కావడమే కాకుండా, తాను పెరిగిన ఇల్లే తన పెళ్లి వేదిక కావాలని కుమార్తె అంజలి రెడ్డి ఆశించినట్లు షర్మిల పేర్కొన్నారు. "మన తెలుగింట ఏ గుమ్మాన్ని అడిగినా చెప్తుంది.. సొంత ఇంట్లో బిడ్డ పెళ్లి చేయడం ప్రతి తల్లిదండ్రులకు అదృష్టమని. కానీ, తాను పెరిగిన ఇల్లే పెళ్లి వేదిక కావాలన్న నా బిడ్డ ఆకాంక్షను నెరవేర్చలేక పోయామని చాలా బాధపడుతున్నా" అంటూ షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

వివాదాల్లేకుండా పెళ్లి జరిపించడమే మా బాధ్యత

వివాహ వేదిక వివాదంపై స్పందించిన ప్రతి ఒక్కరికీ షర్మిల కృతజ్ఞతలు తెలిపారు. "నా కుమార్తె అంజిలి పెళ్లి.. పెద్దలు కుదిర్చిన సంబంధం. వివాద రహితంగా, ఎలాంటి గొడవలు లేకుండా, వివాహం జరిపించాల్సిన బాధ్యత మా మీద ఉంది. అందుకే వైఎస్ అంజిలి రెడ్డి – సోమల రఘురామ్ రెడ్డిల పరిణయ వేడుకను యలహంక ఇంట్లో కాకుండా, వేరే ప్రదేశంలో బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో నిర్వహించాలని నిశ్చయించుకున్నాం" అని తెలిపారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో వేదిక మార్పు తప్పలేదని సూచిస్తూ, కాబోయే నవ దంపతులకు తెలుగు ప్రజల ఆశీస్సులు, దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని వైఎస్ షర్మిల మనసారా ఆకాంక్షించారు. కాగా, షర్మిల ట్వీట్ అంజలిరెడ్డి వివాహం వేదిక మార్పుపై స్పష్టత వచ్చిందని అంటున్నారు. ఇదే సమయంలో బెంగళూరు ఇల్లు తనది అంటూ షర్మిల చెప్పడంతో సోదరుడు జగన్ రెడ్డి వాదనను వ్యతిరేకిస్తున్నట్లు సంకేతాలిచ్చారని అంటున్నారు.

బెంగళూరు ఇల్లు తనది అంటూ జగన్ రెడ్డి లేఖ రాసిన నేపథ్యంలో ఆ ఇల్లు తనది అంటూ షర్మిల కూడా వాదిస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. దీంతో అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం మరింత ముదిరినట్లుగా భావిస్తున్నారు. మరోవైపు ఈ కుటుంబ వివాదం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. మొత్తానికి జగన్ రెడ్డి వైఖరి కారణంగా షర్మిల తన కుమార్తె వివాహ వేదికను మార్చుకోవాల్సివచ్చిందని వ్యాఖ్యానిస్తున్నారు.

మిథున్ రెడ్డికి అరెస్టు ముప్పు.. హైకోర్టులో నిరాశ, పుంగనూరు కేసులో బిగ్ ట్విస్ట్

రాజంపేట వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి అరెస్టు ముప్పు పొంచివుంది. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారించిన హైకోర్టు అరెస్టును ఆపలేమని తేల్చిచెప్పింది. దీంతో ఎంపీ మిథున్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని అంటున్నారు. పుంగనూరు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసుల్లో ఆయనకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు న్యాయస్థానం స్పష్టంగా నిరాకరించింది. అయితే, తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ ఎంపీ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై విచారణను డిసెంబరు 28వ తేదీకి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఆదేశాలు జారీ చేశారు.

పుంగనూరు మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి వెళ్తున్న టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడటం, ప్రైవేటు బౌన్సర్‌తో వాహనాన్ని కార్యకర్తలపైకి తోలించడం వంటి తీవ్రమైన ఆరోపణలపై పుంగనూరు టౌన్ పోలీసులు ఈ నెల 16న ఎంపీ మిథున్‌రెడ్డిపై కేసులు నమోదు చేశారు. మదనపల్లె డీఎస్పీతో పాటు మధుసూదన్ రాయల్, జంపల మోహన్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నమోదైన మొత్తం నాలుగు కేసులను కొట్టివేయాలని కోరుతూ ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఒకే ఘటనపై వేర్వేరుగా నాలుగు కేసులు నమోదు చేయడం చెల్లుబాటు కాదని, కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఈ కేసులు బనాయించారని పేర్కొన్నారు. హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు పిటిషనర్‌కు వర్తించవని, విచారణ పూర్తయ్యే వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును కోరారు.మరోవైపు ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ ఈ వాదనలను తీవ్రంగా ఖండించారు. పిటిషనర్ పుంగనూరును తన అడ్డాగా భావించి, నామినేషన్ కేంద్రం వద్ద అలజడి సృష్టించే ముందస్తు పథకంతోనే భారీ కాన్వాయ్, అనుచరులతో వచ్చారని తెలిపారు. బౌన్సర్‌ను రెచ్చగొట్టి కారును అక్కడ ఉన్న టీడీపీ కార్యకర్తలపైకి నడిపించారని, ఈ దాడుల్లో 30 మందికి పైగా గాయపడ్డారని వివరించారు. ఎంపీపై తీవ్రమైన హత్యాయత్నం కేసులు ఉన్నాయని, దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని తెలిపారు. క్వాష్ పిటిషన్లలో అరెస్టు రక్షణ కోరడానికి వీల్లేదని, రక్షణ కావాలనుకుంటే ముందస్తు బెయిల్ పిటిషన్ ద్వారా చట్టపరమైన మార్గాలను చూసుకోవాలని పీపీ స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులు మధుసూదన్ రాయల్, జంపల మోహన్ నాయుడు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది పీవీజీ ఉమేశ్ చంద్ర కూడా కోర్టులో వాదనలు వినిపించారు. నామినేషన్ల కేంద్రం వద్దకు వెళ్లడానికి పిటిషనర్ పోటీ చేస్తున్న అభ్యర్థి కాదు, లేదా కనీసం అభ్యర్థిని బలపరిచే వ్యక్తి కూడా కాదని, అలాంటప్పుడు అంత మందితో నామినేషన్ కేంద్రం వద్దకు వెళ్లడంలోనే ఆయన దురుద్దేశం స్పష్టమవుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మిథున్‌రెడ్డి నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నందున క్వాష్ పిటిషన్‌లో అరెస్టుపై రక్షణ ఇవ్వకూడదని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఎంపీకి ఎలాంటి మధ్యంతర రక్షణ ఇవ్వడానికి నిరాకరిస్తూ విచారణను డిసెంబరు 28కి వాయిదా వేసింది.ఈ పరిణామంతో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మరోసారి అరెస్టు అయ్యే అవకాశాలు ఉన్నాయని న్యాయవాద వర్గాలు భావిస్తున్నాయి. అయితే హైకోర్టు నిర్ణయాన్ని మిథున్ రెడ్డి సుప్రీంలో సవాల్ చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. దీంతో పోలీసులు అంతవరకు వేచిచూస్తారా? లేక వెంటనే అరెస్టుకు సిద్ధమవుతారా అనేది చూడాల్సివుందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు పోలీసులు నిర్ణయం ఉండొచ్చని అంటున్నారు. స్థానిక ఎన్నికల వేళ ఈ పరిణామం విపక్షం వైసీపీని ఆందోళనకు గురిచేస్తోంది. పుంగనూరు మున్సిపాలిటీ ఏకగ్రీవం అయింది. అయితే 5వ తేదీన జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలు ఉండటంతో ఎంపీ మిథున్ రెడ్డిను అరెస్టు చేసే అంశమై తర్జనభర్జన జరుగుతోందని అంటున్నారు.

సొంత ఊర్లో జగన్ కు బిగ్ సవాల్.. పులివెందుల గెలవక తప్పని పరిస్థితి



మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో విషమ పరిస్థితి ఎదుర్కొంటున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నడూ లేనట్లుగా పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ ఏకగ్రీవాలు చేసుకోవడాన్ని మాజీ సీఎం జగన్ రెడ్డి జీర్ణించుకోలేక పోతున్నారు. తన అడ్డాలో టీడీపీ జెండా పట్టుకున్న వారే లేరనుకున్న ధీమాలో జగన్ రెడ్డి ఉండేవారని చెబుతున్నారు. అయితే ఏకంగా 20 వార్డులు ఏకగ్రీవం చేసుకునే స్థాయికి టీడీపీ చేరుకుంటుందని జగన్ రెడ్డి ఎప్పుడూ ఊహించలేదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో పులివెందుల చైర్ పర్సన్ గా బరిలోకి దిగిన తన సొంత పిన్ని వైఎస్ ప్రమీలమ్మను గెలిపించాల్సిన బాధ్యత జగన్ రెడ్డి భుజస్కంధాలపై పడిందని అంటున్నారు. దీంతోనే మున్సిపల్ ఎన్నికల రోజు జగన్ స్వయంగా రంగంలోకి దిగుతున్నారని చెబుతున్నారు.

పులివెందుల నియోజకవర్గం వైఎస్ కుటుంబం కంచుకోటగా చెబుతున్నారు. గత 40 ఏళ్లుగా వైఎస్ కుటుంబం చెప్పిన వారే స్థానిక సంస్థలలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతూ వస్తున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పులివెందుల నియోజకవర్గంలో మాత్రం వైఎస్ కుటుంబం పెత్తనమే నడిచేదని అంటున్నారు. అటువంటిది తొలిసారిగా వైఎస్ కుటుంబం జీర్ణించుకోలేని స్థితిలో టీడీపీ ఏకగ్రీవాలు చేసుకోవడమే రాజకీయ వర్గాలను ఆకర్షిస్తోందని చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల వరకు పులివెందులలో తనకు ఎదురే లేదన్నట్లు భావించిన మాజీ సీఎం జగన్ రెడ్డికి రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత సొంత నియోజకవర్గంలోనూ సవాళ్లు ఎదురుకావడమే హాట్ టాపిక్ అవుతోందని అంటున్నారు.నిజానికి పులివెందుల రాజకీయాల్లో జగన్ రెడ్డి ఎప్పుడూ నేరుగా జోక్యం చేసుకోలేదని చెబుతున్నారు. తన కుటుంబ సభ్యులు అయిన కడప ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డి, ప్రస్తుత మున్సిపల్ చైర్ పర్సన్ గా పోటీ చేస్తున్న వైఎస్ ప్రమీలమ్మ భర్త మనోహరరెడ్డి మాత్రమే స్థానిక రాజకీయం చూసుకునే వారంటున్నారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం తన సొంత ఇలాకాలో పాతుకుపోయేలా చేస్తున్న ప్రయత్నాలతో జగన్ రెడ్డి ఆందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. భాస్కర్ రెడ్డి పులివెందులలో లేకపోవడం, అవినాశ్ రెడ్డి, మనోహర్ రెడ్డిని పోలీసుల సాయంతో అడ్డుకునేలా టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్న కారణంగా తానే నేరుగా రంగంలోకి దిగాలని జగన్ రెడ్డి భావించారని అంటున్నారు.

ఇప్పటికే ఒకసారి పులివెందుల వెళ్లి వచ్చిన ఆయన ఆదివారం జరిగే పోలింగ్ కు వస్తానని, ఓటు వేస్తానని చేసిన ప్రకటన పులివెందుల వైసీపీ కేడర్ లో ధైర్యం నింపిందని అంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి స్థానికంగా ఉంటే తమ కేడర్ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు వీలు ఉంటుందని, లేదంటే వైసీపీ సానుభూతిపరులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతాయని వైసీపీ నేతలు భయపడుతున్నారని చెబుతున్నారు. దీంతో జగన్ రెడ్డి రాకతో పులివెందుల పోలింగ్ శాతం పెరుగుతుందని, ఇది తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. నిజానికి పులివెందుల మున్సిపల్ చైర్మన్ పీఠం గెలవడం పార్టీ కన్నా మాజీ సీఎం జగన్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్టే ముఖ్యం అంటున్నారు. సొంత నియోజకవర్గంలో సొంత కుటుంబ సభ్యులను గెలిపించుకోలేని పరిస్థితులు ఉంటే జగన్ రాజకీయ భవిష్యత్తుకు కూడా పెను ప్రమాదమన్న సంకేతాలుగానే భావించాల్సివుందని అంటున్నారు. దీంతో పులివెందుల గెలుపు కోసం జగన్ రెడ్డి ఎటువంటి ప్రయత్నాలు చేస్తారనే ఉత్కంఠ ఎక్కువ అవుతోందని అంటున్నారు.

ఇరు పార్టీలదీ 'సేవ్ విశాఖ' ప్రచారమే.. !

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. 120 వార్డుల్లో అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్పొరేటర్ ఎన్నికల పోలింగ్ నవంబర్ 1న జరగనుండగా, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అయితే.. ఈ ఎన్నికల్లో అటు టీడీపీ, ఇటు వైసీపీలు ఒకే నినాదంతో బరిలోకి దిగడం విశేషం. సేవ్ విశాఖ పేరుతో టీడీపీ, వైసీపీ నేతలు ప్రజలను కలుస్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని టీడీపీ నేతలు.. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం పై వైసీపీ నేతలు విమర్శలు సంధిస్తున్నారు.విశాఖలో విలువైన భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారంటూ 'సేవ్ విశాఖ' పోస్టర్‌ను విడుదల చేసి వైసీపీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసీపీ మేయర్ అభ్యర్థిగా వరుదు కళ్యాణి బరిలో ఉన్న నేపథ్యంలో ఆమె దీనిని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. వైఎస్సార్సీపీ తరఫున కేకే రాజు, కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ తదితరులు వివిధ వార్డుల్లో పర్యటిస్తున్నారు. మరోవైపు, టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి తరపున ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజు వంటి నేతలు తమ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగ్స్ నిర్వహిస్తున్నారు.ఇరు పార్టీలు ప్రతిష్మాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికల్లో ప్రచార సరళి ఉధృతంగానే ఉందని చెప్పాలి. వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విస్తృతంగా పర్యటిస్తూ దూకుడుగా ప్రచారం నిర్వహించారు. విశాఖలోని విలువైన ప్రభుత్వ భూములను, ప్రభుత్వ ఆస్తులను కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపిస్తూ వైసీపీ 'సేవ్ వైజాగ్' (విశాఖను కాపాడుకుందాం) అనే నినాదంతో ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.ఇక, ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై విమర్శలు గుప్పిస్తున్నారు. "కిలో బియ్యం రూ.100, ఎకరా పొలం మాత్రం 99 పైసలు" అంటూ వినూత్నంగా విమర్శలు చేశారు. అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించడం, ఓ వర్సిటీకి సంబంధించిన భూముల వివాదాన్ని లేవనెత్తడం, మత్స్యకార నివాసాలు, నిరుద్యోగ భృతి, మహిళా పెన్షన్లపై ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. కూటమి తరఫున టీడీపీ మాజీ కార్పొరేటర్ ముక్కా శ్రావణిని మేయర్ అభ్యర్థిగా బరిలోకి దించి గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు. 'చెప్పాం.. చేస్తున్నాం' మంత్రంతోపాటు వైసీపీ నేతల నుంచి సేవ్ విశాఖ అనే పేరుతో ప్రచారం చేస్తున్నారు. అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం తాము ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే విధానాన్ని నమ్ముకుంది. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో నగర సమగ్ర అభివృద్ధిని తమ ప్రచార అస్త్రంగా మార్చుకుంది.మొత్తం 120 వార్డులలో కూటమి సీట్ల సర్దుబాటు ప్రకారం టీడీపీ 77, జనసేన 32, బీజేపీ 11 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. స్థానిక జనసేన, బీజేపీ శ్రేణులను కలుపుకుని ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసి ప్రచారం నిర్వహించారు. విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ విస్తృతంగా సోషల్ మీడియా ప్రచారాన్ని చేపట్టగా, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, గంటా శ్రీనివాసరావు వంటి సీనియర్ ఎమ్మెల్యేలు స్వయంగా వార్డుల్లో పర్యటించి అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

బెజవాడలో త్రిముఖ పోరు

విజయవాడ, అక్టోబరు 31, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కేంద్రబిందువైన విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. అధికార ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలోనిలవగా, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరోసారి పోటీ పడుతున్నారు. అయితే, ఈ ద్విముఖ పోరును అనూహ్యంగా త్రిముఖ సమరంగా మారుస్తూ మాజీఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగానికి దిగడం బెజవాడ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. వామపక్షాలు , కాంగ్రెస్ పార్టీల ఐక్య మద్దతుతో ఆయననిర్వహిస్తున్న ప్రచారం సాంప్రదాయ రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.మాజీ సీపీగా బెజవాడ నగరంపై పరిపూర్ణమైన పట్టు, శాంతిభద్రతలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏబీ వెంకటేశ్వరరావుతన ప్రచారాన్ని ప్రత్యేక శైలిలో నిర్వహిస్తున్నారు. అవినీతి రహిత నగర పాలన, పన్నుల భారం తగ్గించడం, లంచాలు లేని సేవలు అనే నినాదాలతో మేధావులు, మధ్యతరగతి , విద్యార్థికుల ఓటు బ్యాంక్‌నుఆకర్షించేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. వామపక్ష బలానికి తోడు కాంగ్రెస్ పార్టీ మద్దతు లభించడం, అలాగే సీనియర్ ఐపీఎస్‌గా ఆయనకున్న నిష్కళంకమైన ఇమేజ్ ఏబీవీకి ప్రధాన బలంగామారాయి. ఏ రాజకీయ పార్టీ బంధాలు లేకుండా, కేవలం విజయవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆయన విసురుతున్న సవాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడుపడటం లేదు.అయితే, ఎన్డీయే కూటమిఅభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధాకృష్ణకు బలమైన ప్రజాదరణ, వంగవీటి కుటుంబానికి నగరంలో ఉన్న అభిమానుల బలగం పెద్ద ప్లస్ పాయింట్. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధికార్యక్రమాలు తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. రాధాకృష్ణ, ఏబీ వెంకటేశ్వరరావు ఇద్దరూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా అత్యంతహుందాతనంతో ప్రచారం సాగిస్తుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. రాధా సైతం నగరాభివృద్ధికి ఏబీవీ సలహాలు తీసుకుంటా అని ప్రకటించగా, ఏబీవీ కూడా మాది భావజాల పోరాటమే తప్పవ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు.మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి బిసి సామాజిక వర్గ సమీకరణాలు, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులనే నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు.అయితే, ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందనేది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. నాన్-పొలిటికల్, న్యూట్రల్ ఓటర్లు, మార్పు కోరుకునే వర్గాలు గనక ఏబీవీ వైపు మొగ్గుపడితే కూటమి, వైసీపీ ఓట్ బ్యాంకుల్లో

భారీగా గండిపడే అవకాశం ఉంది. బెజవాడ ఓటర్లు ఎప్పుడూ ఊహించని సంచలన తీర్పులకు వేదికగా నిలుస్తారనే చరిత్ర ఉండటంతో, ఏబీవీ గెలుపు అవకాశాలను రాజకీయ విశ్లేషకులుతోసిపుచ్చలేకపోతున్నారు. వంగవీటి రాధా పవర్ కేడర్, రాయన భాగ్యలక్ష్మి పార్టీ క్యాడర్ బలానికి ఎదురీదుతూ ఏబీ వెంకటేశ్వరరావు సృష్టిస్తున్న ఈ ట్రెండ్ బెజవాడ రాజకీయాల్లో కొత్త చరిత్రకు పునాదివేస్తోంది. సంప్రదాయ పార్టీల ధనప్రవాహం, కుల సమీకరణలను దాటుకుని, వామపక్షాల సంపూర్ణ సహకారంతో ఏబీవీ నిజంగానే బెజవాడ పీఠంపై సంచలనం సృష్టిస్తారా లేక కూటమి-వైసీపీల హోరాహోరీ

మధ్య స్వతంత్ర హోదాకే పరిమితమవుతారా అనేది పోలింగ్ ఫలితాలు తేల్చనున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

తరగతి గదిలోనే రాక్షసత్వం : పదోతరగతి విద్యార్థినిపై పాశవిక దాడి



అనంతపురం జిల్లా రాప్తాడులో ఘోరం చోటు చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువున్న విద్యార్థినిపై పాశవిక దాడి జరిగింది. చెట్లు నరికేందుకు ఉపయోగించిన రంపంతో విద్యార్థిని తలపై ఉన్మాది దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్లంబింగ్ పనులు చేసే పేరుతో పాఠశాలలోకి ప్రవేశించిన దుండగుడు నేరుగా క్లాసురూములోకి వెళ్లి విద్యార్థినిపై దాడి చేసినట్లు తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఈ పరిణామంతో హతాశులైన విద్యార్థినులు వెంటనే దుండగుడిని ఆపేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. దాడిలో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. అడ్డుకునే ప్రయత్నంలో మరో విద్యార్థినికి గాయాలు అయినట్లు చెబుతున్నారు. నిందితుడు బాలికకు సమీప బంధువు అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పదో తరగతి గదిలో విద్యార్థినిపై జరిగిన దాడి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. యథావిధిగా పాఠశాలకు వచ్చిన విద్యార్థిని క్లాసురూములో ఉండగా దుండగుడు ప్రవేశించి దాడి చేసినట్లు చెబుతున్నారు. రంపంతో విద్యార్థినిపై అత్యంత పాశవికంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. రక్తపు మడుగులో ఉన్న బాలికను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. దాడి అనంతరం నిందితుడు రంపంను అక్కడే వదిలేసి పరారయ్యాడు. పోలీసులు నిందితుడు కోసం విస్తృతంగా గాలిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యార్థిని అనంతపురం ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోందని అంటున్నారు. దాడిలో బాలిక ముఖం, తల, వీపుపై తీవ్ర గాయాలు అయినట్లు వైద్యులు తెలియజేశారు.

ఆ రాక్షసుడు దగ్గర బంధువేనా?

విద్యార్థినిపై దాడి చేసిన దుండగుడు సమీప బంధువుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు చెబుతున్నారు. నిందితుడు ఫొటోలను మీడియాకు విడుదల చేశారు. అతడి కోసం రాప్తాడు చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా గాలిస్తున్నారు. చెట్టుకొమ్మలు కోసే రంపాన్ని వెంట బెట్టుకుని స్కూల్ లోకి ప్రవేశించిన దుండగుడు, తరగతి గదిలోకి వెళ్లే ముందు దాన్ని ఆన్ చేసి వెళ్లాడని, ఒక్క ఉదుటన విద్యార్థిని వద్దకు చేరుకుని దాడి చేశాడని చెబుతున్నారు. ఈ హఠాత్ పరిణామంతో టీచర్ తోపాటు పిల్లలు భయాందోళనతో పరుగులు తీశారని అంటున్నారు. కొందరు దుండగుడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, రంపం అక్కడే వదిలేసి పారిపోయినట్లుగా చెబుతున్నారు.

భద్రత చర్యలపై ప్రశ్నలు

రాప్తాడు ఘటన ప్రభుత్వ పాఠశాలల్లో రక్షణ చర్యలను ప్రశ్నార్థకం చేసిందని అంటున్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు చదవే పాఠశాలల్లో భద్రత పెంచాల్సిన అవసరం ఉందని అంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో సెక్యూరిటీ, వాచ్ మన్ వంటి పోస్టులు లేకపోవడంతో ఇలాంటి ఘటనలకు ఆస్కారం కలుగుతోందని అంటున్నారు. ఈవ్ టీజింగ్ వంటి ఘటనల నేపథ్యంలో పాఠశాలల సమయంలో ఆరు బయట పోలీసులు భద్రత కల్పిస్తున్నారు. కానీ, పాఠశాలల లోపల ఎటువంటి భద్రత లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నట్లు చెబుతున్నారు.

సీఎం దిగ్భ్రాంతి

విద్యార్థినిపై దాడి ఘటన తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఫోన్ చేసి వెంటనే అనంతపురం ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. ఆమెకు ఫోన్ చేసి బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని ఓదార్చారు. ఇక విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి అనిత కూడా ఘటనపై స్పందించారు. 'చిన్నారి చెల్లిని క్లాస్‌రూమ్‌లో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు. గుండె బరువెక్కింది. ఉన్మాదులను ఉక్కుపాదంతో అణిచివేస్తాం. ఆడపిల్లల వైపు చూడాలంటేనే భయపడేలా చేస్తాం' అని హెచ్చరిస్తూ ఎక్స్ లో మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు.

అమెరికాలో 'మన స్టైల్' ప్రచారం.. దోశలేశారు.. ఇక పిల్లల ముడ్డి కడగడమే మిగిలింది?

అమెరికాలో ప్రచారం ఎలా ఉంటుంది.. ఒక పెద్ద గ్రౌండ్ లేదా ఇండోర్ స్టేడియంలో మధ్యలో పోటీచేసే అభ్యర్థి నిలబడితే.. చుట్టూ గుండ్రంగా జనాలు కూర్చొని మనోడి వీరావేశా స్పీచులకు చప్పట్లు కొడుతూ ఎంకరేజ్ చేసే సీన్లే ఉండేవి. కానీ కాలం మారింది. అమెరికాలోనూ మన భారతీయ ఎన్నికల ప్రచార సరళి తాజా మిడ్ టర్మ్ ఎన్నికల్లో కనిపిస్తోంది. భారతీయులు ఎక్కువగా ఉండే డలాస్ లో తాజాగా ఓ డెమొక్రటిక్ అభ్యర్థి ఇండియన్ రెస్టారెంట్ కు వెళ్లి ఓట్ల కోసం దోశలు వేయడం వైరల్ అయ్యింది. అమెరికా రాజకీయాల్లో మన దేశీ 'ఎన్నికల మసాలా' ఘుమఘుమలాడుతోందనడానికి ఇదే నిదర్శనం.. మన దగ్గర ఎన్నికలొస్తే చాలు.. నాయకులు టీ కొట్టులో టీ కలుపుతూ.. రోడ్డు పక్కన బండ్లపై దోశలేస్తూ.. పొలాల్లో నాట్లు వేస్తూ జనం ముందుకు రావడం పాత కథే. ఇప్పుడు అచ్చం ఇదే ఫార్ములాను అగ్రరాజ్యం అమెరికా నేతలు కూడా కాపీ కొట్టేస్తున్నారు. అక్కడి రాజకీయ నాయకులను చూస్తుంటే మన దేశీ పొలిటీషియన్లకు డూప్‌లా కనిపిస్తున్నారు.అమెరికాలో ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో ప్రజాస్వామ్యం కాస్తా 'దేశీ కిచెన్'గా మారిపోయింది. ముఖ్యంగా ఇండో-అమెరికన్ ఓటర్లను బురిడీ కొట్టించేందుకు అభ్యర్థులు భారతీయ సంస్కృతిపై ఒక్కసారిగా ఎనలేని ప్రేమ ఒలకబోస్తున్నారు. తాజాగా డెమొక్రటిక్ అభ్యర్థి జేమ్స్ టలారికో చేసిన విన్యాసం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. డాలస్‌లోని ఒక ఇండియన్ రెస్టారెంట్‌కు వెళ్లిన ఆయన పొలిటికల్ స్పీచ్‌లు పక్కనబెట్టి నేరుగా వంటగదిలోకి దూరిపోయారు. అక్కడ పొగలు కక్కే పెనంపై వేడివేడిగా దోశలేసి, స్వయంగా కస్టమర్లకు వడ్డించారు. ఆయన చేసిన రచ్చ చూసి అక్కడ ఉన్నోళ్లంతా ఆయన నాయకుడో లేక కొత్తగా చేరిన చెఫో అర్థం కాక తలలు పట్టుకున్నారు. తేడా ఒక్కటే.. మన దగ్గర ఓట్ల కోసం బిర్యానీల పంపిణీ జరిపితే అక్కడ మాత్రం ప్రచారంలో దోశలు కాలుతున్నాయి.మరోవైపు మన నేతల తరహాలోనే గుళ్లు, గోపురాలు చుట్టూ తిరగడం కూడా మొదలైంది. నిన్నటివరకు ఇటువైపు కూడా చూడని నేతలు.. ఇప్పుడు ముందస్తు దీపావళి వేడుకలకు హాజరవుతూ సెల్ఫీలకు ఫోజులిస్తున్నారు. సెనేటర్ కోరీ బ్రూకర్ లాంటి వారు దీపాల పండుగకు ముందే పొలిటికల్ దీపాలు వెలిగిస్తూ భక్తులతో మమేకమైపోతున్నారు. మన దగ్గర నాయకులు ఓట్ల కోసం చర్చిలు, మసీదులు, గుళ్ల బాట పట్టినట్లే.. అక్కడ కూడా సేమ్ సీన్ రిపీట్ అవుతోంది.

ఓటరు దేవుడు కనిపిస్తే చాలు.. నాయకుడికి చేతిలో ఉన్న దోశల పెనం కూడా ఒక మైక్‌లా మారిపోతుందనడానికి ఇదే బెస్ట్ ఉదాహరణ. ఎన్నికల ముందు ఇలా రెస్టారెంట్లలో దోశలు వేయడం, పండుగల్లో సందడి చేయడం బాగానే ఉంది గానీ.. గెలిచాక కూడా వీళ్లు ఇదే ప్రేమతో ఇండియన్ ఫుడ్ తింటారా? లేక జనం జేబులకు 'దోశ' పెట్టి గాలికి వదిలేస్తారా? అన్నదే అసలు ప్రశ్న.ఓట్ల కోసం దోశలేశారు.. దేవాలయాల చుట్టూ తిరిగారు.. ఇక మిగిలింది మన నేతల తరహాలో వీధుల్లోకి వచ్చి చిన్న పిల్లల ముడ్డి కడగడం.. ముసలమ్మలకు ముద్దులు పెట్టడం.. రోడ్లు ఊడవడం మాత్రమే.. అప్పుడు కానీ అమెరికా ఎన్నికల ప్రచారం 100% 'భారతీయ మార్కు' పూర్తి చేసుకోదు. ఓటు మహిమ ఎంతటి అగ్రరాజ్య నేతనైనా దోశల మాస్టర్‌లా మార్చేస్తుందని ఈ ఎన్నికల ప్రచారం నిరూపిస్తోంది..

ఫైవ్‌స్టార్ హోటల్.. స్విమ్మింగ్ పూల్‌లో మృత్యుఘోష.. ఇద్దరు విదేశీయులు బలి..

లగ్జరీ హోటల్.. అత్యాధునిక సౌకర్యాలు.. ఒక్క రోజుకు రూ.25 వేలకు పైగా గది అద్దె. కానీ అంతర్జాతీయ స్థాయి ఆతిథ్యం ఇస్తామని చెప్పే ఆ ఫైవ్‌స్టార్ హోటల్‌లో అతిథుల ప్రాణాలకు కనీస భద్రత కరువైంది. బెంగళూరులోని ఓ ప్రముఖ 24 అంతస్తుల లగ్జరీ హోటల్‌లో జరిగిన ఘోర ప్రమాదం విదేశీ అతిథుల ప్రాణాలను బలిగొనడమే కాకుండా.. దేశంలోని ఆతిథ్య రంగంలో భద్రతా ప్రమాణాలపై అనేక తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.

శుక్రవారం సాయంత్రం హోటల్ మూడో అంతస్తులోని స్విమ్మింగ్ పూల్‌లో కొందరు అతిథులు ఈత కొడుతుండగా.. ఒక్కసారిగా విద్యుత్ ప్రవాహం నీటిలోకి లీకైంది. దీంతో పూల్‌లో ఉన్నవారు తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ దుర్ఘటనలో జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ సిబ్బంది అలెగ్జాండర్ మాక్సిమిలియన్ థిస్ (57), స్లోవేకియాకు చెందిన ఐబీఎమ్ ప్రాజెక్ట్ మేనేజర్ యురాజ్ హోర్వాత్ (45) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.మరోవైపు పూల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అమెరికాకు చెందిన మ్యాథ్యూ డిసాంటిస్ (41) అనే అతిథితో పాటు హోటల్ అటెండెంట్ రాహుల్ తివారీ (28) ధైర్యంగా ముందుకు వచ్చారు. ఆ క్రమంలో వారిద్దరూ కూడా విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని మణిపాల్ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ప్రమాదం జరిగిన తీరు కంటే దాని తర్వాత హోటల్ యాజమాన్యం వ్యవహరించిన తీరు మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదంపై అధికారికంగా స్పందించని యాజమాన్యం, శనివారం ఉదయం తమ వెబ్‌సైట్‌లో 'నిర్వహణ పనుల నిమిత్తం' అక్టోబర్ 31 నుంచి నవంబర్ 30 వరకు పూల్‌ను మూసివేస్తున్నట్లు ఒక నోటీసు ఉంచడం అనేక అనుమానాలకు తావిస్తోంది. విద్యుత్ లీకేజీని అడ్డుకోవడంలో ఎర్తింగ్, సర్క్యూట్ బ్రేకర్లు వంటి కనీస భద్రతా వ్యవస్థలు ఎందుకు పనిచేయలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతిక లోపాలు, నిర్లక్ష్యంపై దర్యాప్తు వేగవంతం చేశారు. విశ్రాంతి కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన ఈ సంఘటన.. కేవలం ఒక హోటల్ వైఫల్యాన్ని సూచిస్తోంది. లగ్జరీ రిసార్టులు, హోటళ్లలో భద్రతా తనిఖీల ఆవశ్యకతను మరోసారి గుర్తుచేస్తోంది.

ట్రంప్ మారడు.. ఆ బుద్ధీ మారదు..

అమెరికా ఎన్నికలు అంటే విధానాలు.. ఆర్థిక వ్యవస్థ.. ప్రజా సంక్షేమం గురించి ఆస్కార్ రేంజ్ డిబేట్లు ఉంటాయని అమాయకంగా అనుకుంటే పొరపాటే. డోనాల్డ్ తాత ప్రచారంలోకి దిగారంటే చాలు... అది పొలిటికల్ మైదానం కాదు.. వివాదాల రింగ్ మాస్టర్ షోగా మారిపోతుంది. 'ఎన్నికలొచ్చాయి... మళ్ళీ నా రూటు మార్చను' అంటూ డెమోక్రాట్లపై తనదైన స్టైల్లో విరుచుకుపడుతూ వైట్ హౌస్ ఆశలతో దూసుకుపోతున్నారు ట్రంప్.

మధ్యంతర ఎన్నికలు ముగింపు దశకు చేరుకుంటున్న వేళ మిచిగాన్ ప్రచార సభలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చూస్తే ఎవరికైనా కళ్ళు తేలేయాల్సిందే. డెమొక్రటిక్ పార్టీ సెనెట్ అభ్యర్థి.. ముస్లిం నేత అబ్దుల్ ఎల్-సయ్యద్‌ను గురిపెట్టి 'ఆయన ఒక జిహాదీ' అంటూ డైరెక్ట్ సెటైర్లు, ఘాటు ఆరోపణలు విసిరారు. అంతటితో ఆగితే ఆయన ట్రంప్ ఎందుకవుతారు? 9/11 దాడి జ్ఞాపకాలను తోడి.. సదరు అభ్యర్థికి 'ముస్లిం బ్రదర్‌హుడ్'తో సంబంధాలున్నాయని సరికొత్త స్క్రిప్ట్ అల్లేశారు. "ఆయన గనుక సెనెట్‌లోకి అడుగుపెడితే గడప వద్దే మెటల్ డిటెక్టర్లు పెట్టి రోజూ చెక్ చేయాలి" అంటూ ఎల్-సయ్యద్ వ్యక్తిగత గుర్తింపుపై పెట్టిన సెటైరికల్ ముద్రలు ఇప్పుడు నెట్టింట.. రాజకీయ వర్గాల్లో పెద్ద రచ్చకే తెరలేపాయి. భయం నమ్మకం కన్నా త్వరగా ఓట్లు రాలుస్తుందనే పాత ఫార్ములాను ట్రంప్ మళ్ళీ గట్టిగా నమ్ముకున్నట్లున్నారు.ఇక ఫ్లోరిడాలోని డేటోనా బీచ్ సభలో మరో వినోదం చోటుచేసుకుంది. మైక్ పట్టుకుని ఊగిపోతున్న ట్రంప్‌కు నిరసనకారులు నాలుగుసార్లు అడ్డుపడేసరికి తాతగారికి కోపం నరనరాలకూ పాకింది. 'నోరు మూసుకో లూజర్' అంటూ మైకులోనే నిరసనకారుడిపై బరస్ట్ అయ్యి.. అటకెక్కిన సహనంతో అతన్ని బయటకు తోసేయమని ఆర్డర్ వేశారు. విమర్శలను స్వీకరించడం కంటే ఎదురుతిరిగే వారిని బెదిరించడమే మాస్ లీడర్‌షిప్ అని ఆయన ఫీల్ అవుతున్నారో ఏమో..మరోవైపు 4.3 కోట్లకు పైగా ఓటర్లు ముందస్తుగా ఓటేసి రికార్డు సృష్టించారు. అంటే అమెరికా ప్రజలు ఈ పొలిటికల్ డ్రామాను క్లోజ్ రేంజ్‌లో వాచ్ చేస్తున్నారని అర్థమవుతోంది. మరి ట్రంప్ విసిరిన ఈ 'భయాల మంత్రం'.. 'దూకుడు మంత్రం' ఓట్ల వర్షం కురిపిస్తుందా? లేక తటస్థ ఓటర్లకు విసుగు తెప్పించి రివర్స్ కొడుతుందా? ఈ నాటకానికి ఎండ్ కార్డ్ పడేది ఎన్నికల ఫలితాల్లోనే.. ఫలితం ఏంటో వేచిచూడాలి మరీ..

ఇన్‌స్టాగ్రామ్‌లో సీక్రెట్ లొకేషన్.. రూ.2 వేల ఎంట్రీ ఫీజు.. హైదరాబాద్ శివారులో వెలుగుచూసిన భారీ పూల్...



హైదరాబాద్ శివారు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో రాత్రివేళ నిర్వహించిన ఓ "పూల్ పార్టీ" తీవ్ర కలకలం రేపింది. కమ్మెట గ్రామం వద్ద ఉన్న ఎల్జీ ఫామ్‌హౌస్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యార్థులతో భారీ పూల్ పార్టీ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్.ఓటీ), చేవెళ్ల పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో సుమారు 108 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు.పోలీసుల ప్రాథమిక విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పార్టీకి ప్రధాన నిర్వాహకుడిగా వ్యవహరించిన ఒక అనే యువకుడు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఫ్రెండ్స్ , ఫాలోవర్లకు ఆహ్వానాలు పంపాడు. పార్టీ వేదికను ముందుగా చెప్పకుండా రహస్యంగా ఉంచాడు. ఎంట్రీ ఫీజు కింద ఒక్కొక్కరి నుంచి రూ.1,000 నుంచి రూ.2,000 వరకు డిజిటల్ విధానంలో వసూలు చేశాడు. డబ్బులు చెల్లించిన వారికి మాత్రమే చివరి నిమిషంలో ఫామ్‌హౌస్ లొకేషన్ షేర్ చేసి రప్పించినట్లు విచారణలో తేలింది.ఈ పార్టీకి శంకరపల్లి మండలం దొంతన్‌పల్లిలోని ఓ యూనివర్సిటీకి చెందిన బీబీఏ, ఇంజినీరింగ్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చినట్లు సమాచారం. గతంలో అక్కడ జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో పరిచయాల ఆధారంగా సదురు యువకుడు వీరిని ఆహ్వానించాడు. పోలీసులు దాడి చేసిన ద

సమయంలో పారిపోవడానికి ప్రయత్నించిన విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారందరికీ పరీక్షలు నిర్వహించగా.. ప్రధాన నిర్వాహకుడు తో పాటు మరో ఇద్దరు విద్యార్థులకు గంజాయి పాజిటివ్‌గా వచ్చింది. సంఘటనా స్థలంలో భారీగా మద్యం సీసాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఫామ్‌హౌస్‌లో గంజాయి ఎలా లభ్యమైంది? దీని వెనుక ఎవరున్నారు? ఫామ్‌హౌస్ యజమాని ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేకంగా 'ఈగల్ ఫోర్స్' ఏర్పాటు చేసి దాడులు తీవ్రతరం చేసిన నేపథ్యంలో విద్యార్థులు లక్ష్యంగా జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.

ఆఫీస్ పనులతో బిజీగా ఉన్నారా? పిల్లలతో టైం గడపలేకపోతున్నారా ? ఈ కొత్త కాన్సెప్ట్ ట్రై చేయండి!

వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న చాలామందికి వర్కింగ్ అవర్స్ పెరిగాయి. మునుపటి కంటే టార్గెట్లు ఎక్కువయ్యాయి. దాంతో పేరుకు ఇంట్లో ఉంటున్నారే తప్ప, పిల్లలతో గడపడానికి టైం ఉండట్లేదు. అంతేకాదు, భార్యాభర్తలిద్దరూ వర్క్ ఫ్రమ్ హోమ్ లో ఉంటే, ఆ ఇల్లు ఒక ఆఫీస్ అయిపోతోంది. అమ్మానాన్నలు కంప్యూటర్ల ముందు కూర్చుంటే... పిల్లలు మరో రూమ్లో ఫోన్లలో ఆన్లైన్ క్లాసులు వింటున్నారు. అయితే ఇలాంటి బిజీ షెడ్యూల్ నుంచి బయటికొచ్చి పిల్లలతో గడిపేందుకు వచ్చిన కాన్సెప్ట్ 'డూ నతింగ్'. అంటే ఏ పనీ చేయకుండా ఉండటం.

ఆఖరిసారిగా మీరు ఏ పనీ చేయకుండా ఉన్నదెప్పుడు ? ఎప్పుడైనా ఖాళీగా ఉండి.. టైం వేస్ట్ కాలేదని అనుకున్నారా ? ఎలాంటి ప్లాన్ లేకుండా ఫ్యామిలీతో టైం స్పెండ్ చేశారా? ఇలాంటి ప్రశ్నలు కొత్తగా ఉంటాయి. 'పిల్లలతో రోడ్ ట్రిప్స్ కి వెళ్తున్నాం', 'పార్క్ లో గేమ్స్ ఆడుతున్నాం', 'ఆన్లైన్ క్లాసులప్పుడు హెల్ప్ చేస్తున్నాం.. ఇవన్నీ పిల్లల కోసమే కదా అంటారా? అయితే ఇవేవీ 'డూ నతింగ్' కిందకు రావు. మరి ఏం చేయకుండా ఎలా ఉండాలో తెలుసుకుందాం......

పది నిమిషాలు చాలు

ఆఫీస్ పని, ఇంట్లో పనులు రోజూ ఉండేవే. అయితే వాటికోసం ఇరవై నాలుగ్గంటలు కేటాయించనక్కర్లేదు. అలాగని "డూ నతింగ్" కోసం గంటల సమయం అవసరం లేదు. రోజు మొత్తంలో నాలుగు గంటలకోసారైనా ఐదు, పది నిమిషాలు కేటాయిస్తే చాలు. ఆ పది నిమిషాలు ప్రపంచానికి పూర్తిగా డిస్కనెక్ట్ అయ్యి ఫ్యామిలీతోనే ఉండాలి. కావాలంటే రోజులో ఎప్పుడెప్పుడు ఖాళీగా ఉండాలో ఒక షెడ్యూల్ వేసుకోవచ్చు. మొదట్లో ఆ టైం పీరియడ్ లో ఏం చేయాలో తెలియకపోవచ్చు. కానీ, వారాలు గడుస్తున్న కొద్దీ డూ నతింగ్ కాన్సెప్ట్ ని ఎవరికి వాళ్లు కొత్తగా ట్రై చేస్తారు. ఆఫీస్ ఫోన్ కాల్స్ మధ్యలో పావుగంట గ్యాప్ వచ్చినా, బాస్ తో అపాయింట్మెంట్ కాన్సిల్ అయినా.. ఆ టైం డూ నతింగ్ కి ఉపయోగించుకోవచ్చు. అంతేతప్ప ఆ గ్యాప్లో ఫోన్ పట్టుకోవడం, సోషల్ మీడియాలో స్క్రోలింగ్ చేయడం కాకుండా పిల్లలతో రిలాక్స్ అవ్వాలి.

ఆన్ ప్లగ్ గ్యాడ్జెట్స్

ఫిజికల్ గా.. మెంటల్ గా ఎప్పుడైనా డల్ అయినప్పుడు చాలామంది చేసేపని ఫోన్ పట్టుకోవడం లేదా టీవీ ఆన్ చేయడం.

అయితే ఈ రెండూ టైం, ఎనర్జీని వాడుకుంటాయే తప్ప బూస్ట్ చేయలేవు. డూ నతింగ్ కాన్సెప్ట్ మైండ్ అసలు ఎంగేజ్ లో ఉండకూడదు. ఫోన్ పట్టుకున్నారంటే.. బ్రెయిన్ దాన్ని చూసే పనిలో ఉందని, అదే బ్రెయిన్ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ ఎనర్జీని ఖర్చు చేస్తోందని అర్థం చేసుకోవాలంటాడు ఇంగ్లీష్ రైటర్ సిలెస్ట్ హెడ్లీ. అందువల్ల డూ నతింగ్ టైంని ఫోన్, టీవీకి కాకుండా ఫ్యామిలీకి ఇవ్వాలి. ఖాళీ టైం దొరికినప్పుడు ఫోన్ ని ఫ్లైట్ మోడ్లో పెట్టుకోవాలి. లాప్ టాప్ వంటి గ్యాడ్జెట్స్ ఆఫ్ చేయాలి. ఆ టైంలో పిల్లల్ని వీధుల్లో తిప్పుతూ ఆకాశంలో నెమ్మదిగా ప్రయాణిస్తున్న మేఘాలను చూస్తుండొచ్చు. కావాలంటే అలారం సెట్ చేసుకుని, మళ్లీ వర్క్ లో జాయిన్ అవ్వచ్చు.

స్టార్ట్ స్మాల్

డూ నతింగ్ అనేది అనుకున్నంత సులువు కాదు. ఎలాంటి ప్లాన్స్, షెడ్యూల్స్, ఎజెండా లేకుండా మైండ్ ని క్లియర్ గా ఉంచుకోవడమే ఈ కాన్సెప్ట్. పిల్లలైనా, పెద్దలైనా ఈ కాన్సెప్ట్ మొదలు పెట్టిన కొత్తలో ఎక్కువ సమయం ఖాళీగా ఉండటం కష్టం. అందువల్ల చిన్నచిన్న ఇంటర్వెల్స్ లో డూ నతింగ్ సెట్ చేసుకోవాలి. ఆఫీస్ వర్క్ లో ఉన్నప్పుడు మధ్యమధ్యలో ఐదు నిమిషాలు పిల్లలు, ఫ్యామిలీతో గడపొచ్చు. అలాగని వాళ్లతో బలవంతంగా బుక్ రీడింగ్, డ్రాయింగ్ చేయించడం కాదు. ఎలాంటి ఆలోచన లేకుండా వాళ్లతో గడపడం ముఖ్యం.

గిల్టీ ఫిలింగ్ వద్దు

ఇంతసేపు ఏమీ చేయకుండా టైం వేస్ట్ చేశామనే గిల్టీ ఫీలింగ్ ఉండకూడదు. అందువల్ల ఎప్పటికప్పుడు మనసుకు గుర్తుచేసుకోవాల్సిన విషయం ఏంటంటే.. 'మనం సంతోషంగా, ప్రశాంతంగా ఉండటానికి కావాలనే ఏం చేయొద్దనే కాన్సెప్ట్ ని ఎంచుకున్నాం' అని. కాబట్టి 'టైం వేస్ట్ అయింది... బద్ధకంగా ఉన్నామా' అనే అనుమానాలు పెట్టుకోవద్దు. ఫ్యామిలీ లైఫ్ తో పాటు ఆఫీస్ వర్క్ ప్రొడక్టివిటీ పెరగాలంటే ఇలాంటి చిన్నచిన్న బ్రేక్స్ చాలా అవసరం.

రూల్స్ పెట్టొద్దు

ఎజెండా లేకుండా ఫ్యామిలీతో కూర్చుని టైం గడపడం ఎలా? అనే సందేహం అందరికీ వస్తుంది. తెలియకుండా ఒక గేమ్ లేదా యాక్టివిటీ ప్లాన్ ని బ్రెయిన్ సూచిస్తుంది. దాన్ని కంట్రోల్ చేసుకుని అప్పటి ప్రజెంట్ మూమెంట్ ని ఎంజాయ్ చేయాలి. ఒక్కోసారి పిల్లలకు బోర్ కొట్టే అవకాశం ఉంది కాబట్టి మాటలతో ఎంగేజ్ చేయొచ్చు. పిల్లలకు ఆడుకోవాలని ఉంటే ఆడనివ్వాలి. కానీ ఆటలో పేరెంట్స్ ఏ రూల్స్ పెట్టొద్దు. ఇలా చేస్తున్న కొద్దీ పిల్లలతో పాటు పెద్దలూ క్రియేటివ్ టైంని స్పెండ్ చేస్తారు.

చుట్టు పక్కల తిరిగితే చాలు

డూ నతింగ్ కోసం పార్కులు, దూర ప్రదేశాలకు వెళ్లడం కరెక్ట్ కాదు. చుట్టుపక్కల పరిసరాల్లోనే టైం స్పెండ్ చేయాలి. ఫిట్ నెస్ గోల్స్ ని పక్కనబెట్టి, పిల్లలతో ఇంటి చుట్టూ నాలుగు రౌండ్లు వాకింగ్ చేయొచ్చు. పువ్వులు, ఆకులు, మట్టిని చూపించి పిల్లలకు వాటి కలర్స్ ఏంటో చెప్పొచ్చు. చల్లటి గాలులను ఎంజాయ్ చేయొచ్చు. నడుస్తున్న అడుగుల చప్పుళ్లను అబ్జర్వ్ చేయొచ్చు. ఇవన్నీ డూ నతింగ్ టైంలో చేస్తే, పిల్లలు పేరెంట్స్ తో పాటు నేచరికి కూడా కనెక్ట్ అవుతారు. అయితే ఉదాహరణకు చెప్పిన పనులను పనికట్టుకుని చేయొద్దు సుమీ.

లండన్ నుంచి ముగ్ధ రహస్యంగా ఎందుకొచ్చింది.. పూణేలో ఎందుకు చనిపోయింది.. అంతుచిక్కని మిస్టరీ

లండన్‌లో భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటోందని ఆశగా ఎదురుచూస్తున్న ఆ కంటికి.. కనీసం స్వదేశం వచ్చిందనే సమాచారం కూడా లేదు.. చివరికి పూణేలోని ఒక మూసిన తలుపుల వెనుక తన కూతురు అనంత లోకాలకు వెళ్లిపోయిందని తెలిసిన ఆ తండ్రి గుండె పగిలిన దృశ్యం.. నిశ్శబ్దంగా మిగిలిపోయిన ఓ జీవిత మిస్టరీకి సాక్ష్యంగా నిలిచింది.

లండన్‌లో ఉన్నత చదువులు చదువుతోందని భావించిన తల్లిదండ్రులకు కోలుకోలేని షాక్. ఆగస్టులోనే భారత్ చేరుకుని.. ఎవరికీ తెలియకుండా పూణేలోని విలాసవంతమైన ఫ్లాట్‌లో నివసిస్తున్న 34 ఏళ్ల ముగ్ధ అవినాశ్ దేశ్‌ముఖ్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు.. బ్యాంక్ లావాదేవీల ఆధారంగా పోలీసులు ఫ్లాట్ తలుపులు తెరిచి చూడగా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌కు చెందిన ముగ్ధ (34) ఎంబీఏ పూర్తి చేసేందుకు 2025 జులైలో లండన్ వెళ్లింది. క్రమం తప్పకుండా ఫోన్ కాల్స్.. మెసేజ్‌లు చేస్తుండటంతో ఆమె విదేశాల్లోనే చదువుకుంటోందని కుటుంబ సభ్యులు నమ్మారు. అయితే ఎవరికీ అనుమానం రాకుండా ఈ ఏడాది ఆగస్టులోనే ఆమె బ్రిటన్ విడిచి భారత్‌కు తిరిగొచ్చింది. స్వదేశం వచ్చిన విషయాన్ని కుటుంబానికి చెప్పకుండా పూణే పింప్రి-చించ్వాడ్ పరిధిలోని గహుంజే వద్ద ఉన్న లోధా బెల్మోండో రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో ఒక ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని ఒంటరిగా నివాసముండటం ప్రారంభించింది.అక్టోబర్ 24 నుంచి ముగ్ధ ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో తండ్రి అవినాశ్ దేశ్‌ముఖ్‌కు అనుమానం వచ్చింది. లండన్‌లోని ఆమె స్నేహితురాలిని విచారించగా ముగ్ధ ఆగస్టు నెలాఖరులోనే బ్రిటన్ విడిచి వెళ్లినట్లు బ్రిటన్ పోలీసుల ద్వారా తెలిసింది. వెంటనే తండ్రి ఆమె బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్‌ను

పరిశీలించగా కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. అక్టోబర్ 8 నుంచి 25 మధ్య కాలంలో అనేక ఫుడ్ డెలివరీ, ఆన్‌లైన్ పేమెంట్లు కనిపించాయి. ఒక లావాదేవీ ఛత్రపతి శంభాజీనగర్‌లోని ఉస్మాన్‌పురా ప్రాంతంతో ముడిపడి ఉండటంతో ఆమె భారత్‌లోనే ఉందనే విషయం స్పష్టమైంది. సాంకేతిక ఆధారాలను ఛత్రపతి శంభాజీనగర్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు అందించడంతో అన్వేషణ వేగవంతమైంది.క్రైమ్ బ్రాంచ్ అందించిన సమాచారంతో షిర్‌గావ్ పోలీసులు పూణేలోని ఫ్లాట్ వద్దకు చేరుకున్నారు. తాళాలు తీసే నిపుణుడి సహాయంతో తలుపులు తెరిచి లోపలికి వెళ్లిన పోలీసులకు ముగ్ధ మృతదేహం కనిపించింది. శరీరంపై ఎలాంటి బాహ్య గాయాలు లేవని ముగ్ధ ఈ ఫ్లాట్‌ను ఏప్రిల్‌లోనే అద్దెకు తీసుకోగా ఆగస్టు నుంచి ఇక్కడే ఉంటున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలోనూ మరణానికి స్పష్టమైన కారణం తేలకపోవడంతో ఈ ఘటన మరింత మిస్టరీగా మారింది. లండన్ నుంచి అంత రహస్యంగా ఎందుకు తిరిగొచ్చింది? స్వదేశానికి వచ్చిన విషయాన్ని కుటుంబ సభ్యులకు ఎందుకు దాచింది? పూణేలోని ఫ్లాట్‌లో ఒంటరిగా ఉండటానికి గల కారణమేంటి? అక్టోబర్ 24 తర్వాత అసలు ఏం జరిగింది? మరణానికి ముందు ఎవరైనా వచ్చారా? ఇవే ఈ కేసులో అంతుచిక్కని ప్రశ్నలుగా మిగిలాయి. ప్రస్తుతం ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు, డిజిటల్ సీడీఆర్ ఆధారంగా పోలీసులు అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ముగ్ధ మిస్టరీ మరణం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

సముద్రాలు దాటిన చెన్నై ఆటో.. అసలు స్టోరీ ఏంటో తెలుసా?

సాధారణంగా మన దేశానికి వచ్చే విదేశీ పర్యాటకులు ప్రయాణాల కోసం కార్లు, రైళ్లు లేదా విమానాలను ఎంచుకుంటారు. కానీ బ్రిటన్‌కు చెందిన ఒక విదేశీ జంట మాత్రం భారతదేశాన్ని చుట్టేయడానికి ఏకంగా ఒక ఆటో రిక్షాను కొనుగోలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. చెన్నైలో కొన్న ఆ త్రీ-వీలర్‌పై ఏకంగా 4,218 కిలోమీటర్లు ప్రయాణించడమే కాకుండా, ప్రయాణం పూర్తయ్యాక దాన్ని తమ దేశానికి కూడా తీసుకెళ్లారు. ఆసక్తికరమైన ఈ సాహస యాత్ర విశేషాలు ఇప్పుడు తెలుసుకుందాం .

చెన్నైలో కొనుగోలు.. 'టిమ్మీ'గా పేరు:

బ్రిటన్‌కు చెందిన హెలెన్, మిక్ అనే జంట భారతదేశంలో ఒక ప్రత్యేకమైన అనుభూతిని పొందాలని అనుకున్నారు. అందుకోసం తమిళనాడులోని చెన్నైలో ఒక ఎరుపు రంగు బజాజ్ ఆటో రిక్షాను కొనుగోలు చేశారు. ఆ ఆటోకు ముద్దుగా "టిమ్మీ ది టిన్ క్యాన్" అని పేరు పెట్టడమే కాకుండా, దాని ముందు భాగంలో కార్టూన్ కళ్లు, నవ్వుతున్న ముఖాన్ని చిత్రించి చాలా క్యూట్‌గా మార్చేశారు.

75 రోజులు.. 4,218 కిలోమీటర్ల యాత్ర:

అసలు ఆటో నడపడం కూడా సరిగ్గా రాని ఈ జంట, ఆ త్రీ-వీలర్‌పై భారతదేశంలో ఒక భారీ సాహస యాత్రను ప్రారంభించారు. దాదాపు 75 రోజుల పాటు నిరంతరం ప్రయాణిస్తూ గోవా, ఆగ్రాలోని తాజ్ మహల్ సహా ఎన్నో అందమైన ప్రాంతాలను చుట్టేశారు. ఇక మొత్తం 4,218 కిలోమీటర్ల సుదీర్ఘ దూరాన్ని ఈ చిన్న ఆటోలోనే విజయవంతంగా అధిగమించి తమ ప్రయాణాన్ని పూర్తి చేశారు.

వదిలివెళ్లలేక.. షిప్పింగ్‌లో లండన్‌కు:

భారత్‌లో సాగిన ఈ సుదీర్ఘ ప్రయాణంలో వారు ఆ ఆటోతో తీవ్రమైన అనుబంధాన్ని పెంచుకున్నారు. ప్రయాణం ముగిసిన తర్వాత ఆ ఆటోను ఇక్కడే వదిలేసి వెళ్లడానికి వారి మనసు ఒప్పలేదు. దాంతో ప్రత్యేకంగా షిప్పింగ్ కంటైనర్‌ను బుక్ చేసి, సముద్ర మార్గంలో ఆ ఆటోను ఏకంగా యునైటెడ్ కింగ్‌డమ్ కు తరలించారు. మన దేశపు ఆటోపై వారు చూపించిన ప్రేమ నిజంగా విశేషమనే చెప్పాలి.

లండన్ వీధుల్లో మన చెన్నై ఆటో:

దాదాపు 6 నెలల నిరీక్షణ తర్వాత 'టిమ్మీ' సురక్షితంగా బ్రిటన్ పోర్టుకు చేరుకుంది. లండన్ పోర్టులో తమ ప్రియమైన ఆటోను తిరిగి చూడగానే ఆ జంట ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఇక ప్రస్తుతం లండన్ వీధుల్లో ఈ ఎరుపు రంగు భారతీయ ఆటో చక్కర్లు కొడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా హల్ చల్ చేస్తున్నాయి.

ఇక మొత్తానికి చూస్తే, చెన్నై వీధుల్లో మొదలైన ఒక సాధారణ ఆటో ప్రయాణం ఏకంగా సముద్రాలు దాటి లండన్ వీధుల్లో ముగిసింది. భారత్‌లోని పర్యాటక ప్రాంతాలను ఆస్వాదిస్తూ, మన ఆటోపై వారు చూపించిన ఈ అపూర్వమైన ప్రేమ ప్రస్తుతం నెటిజన్లను ఎంతో ఆకట్టుకుంటోంది.

చలికాలంలో చర్మం డ్రైగా మారుతోందా ? ఇంట్లోనే ఇలా నేచురల్ స్క్రబ్ తయారు చేసుకోండి!

సీజన్ తో పాటు స్కిన్ కేర్ రొటీన్ కూడా మారుతుంది. శీతాకాలంలో చర్మం పొడిబారకుండా చూసుకోవాలి. అందుకోసం ఇంటివద్ద తయారు చేసుకున్న బాడీ స్క్రబ్ వాడటం బెటర్. ఇదయితే మురికితో పాటు మృతకణాల్ని కూడా తొలగిస్తుంది. చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది.

కావాల్సినవి:

బియ్యప్పిండి-50 గ్రా., మసూర్ దాల్ (ఎర్రకందిపప్పు) - 30 గ్రా. ఓట్స్ - 20 గ్రా. ముల్తానీ మట్టి- 20 గ్రా. రెండు గ్రాముల చొప్పున వేపాకుల పొడి, పసుపు, కొన్ని చుక్కల లావెండర్ లేదా ఎసెన్షియల్ ఆయిల్, కొంచెం పెరుగు.

తయారీ:

ఒక గిన్నెలో పైన చెప్పిన వాటన్నింటినీ వేసి కలపాలి. ఈ స్క్రబ్ తో ముఖం మీద మెల్లిగా మసాజ్ చేయాలి. ఆరాక నీళ్లతో కడిగేయాలి. దాంతో ముఖం మీది మురికి, డెడ్ సెల్స్ పోయి చర్మం తాజాగా ఉంటుంది.

జ్యోతిష్యం: నవంబర్ నెల.. వృశ్చిక రాశి.. ఉద్యోగస్తులకు కొత్త బాధ్యతలు..

2026 నవంబర్? నెలలోదీపావళి.. నాగులచవితి పండుగలతో పాటు .. ఆధ్యాత్మిక మాసం కార్తీక మాసం ప్రారంభం కానుంది. గ్రహాల సంచారంలో కీలక మార్పులు ఉన్నాయని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. ఈ నెలలోవృశ్చిక రాశి వారి జీవితంలో సరికొత్త సమీకరణాలకు తెరలేపే అవకాశాలున్నాయి. గ్రహాల సంచారం ఆధారంగా ఈ నెలలో వృశ్చిక రాశి వారికి ఎలా ఉంటుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!

నవంబర్ 6 (అర్ధరాత్రి 12:45 గంటలకు) శుక్రుడు కన్యా రాశిలోకి ప్రవేశం
నవంబర్ 14న కన్యారాశిలో శుక్రుడు సంచారంలో దిశ మార్పు
నవంబర్ 22 (సాయంత్రం 5:38 గంటలకు) శుక్రుడు తులా రాశిలోకి ప్రవేశం
నవంబర్ 12 (రాత్రి 8:30 గంటలకు) కుజుడు సింహ రాశిలోకి ప్రవేశం
నవంబర్ 13న తులారాశిలో బుధుడు సంచారంలో దిశ మార్పు
నవంబర్ 16 (సాయంత్రం7:48 గంటలకు)సూర్యుడు వృశ్చిక రాశిలోకి ప్రవేశం
నవంబర్ 25న రాహువు మకరరాశిలోకి ప్రవేశం

వృశ్చిక రాశి వారికి2026 నవంబర్ మాసంలో గ్రహాల స్థితిగతుల ప్రకారం మిశ్రమ ఫలితాలు ఉంటాయని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. ఉద్యోగస్తులకు ప్రమోషన్? తో పాటు కొత్త బాధ్యతలు దక్కే అవకాశం ఉంది. సహోద్యోగులతో పాటు ఉన్నతాధికారుల అనుగ్రహం కలుగుతుంది. ఆఫీసులో మంచి వాతావరణం ఉంటుంది. వ్యాపారస్తులకు గతంలో నిలిచిపోయిన డబ్బు చేతికి అందుతుంది. కొత్త ప్రాజెక్టుల్లో పెట్టుబడుల వలన మంచి లాభాలు వస్తాయి. ఆదాయ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కుటుంబంలో సామరస్యం, సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది.

ఈ రాశి వారు నవంబర్? నెలలో లక్ష్యాలను సాధిస్తారు. ఓర్పు, పట్టుదలతో అన్ని పనులు పూర్తి చేసుకుంటారు. పాత బకాయిలను వసూలవుతాయి. ఉద్యోగం మారాలనుకొనే వారికి మంచి సమయమని పండితులు చెబుతున్నారు.

ఆర్థిక సమస్యలను అధిగమిస్తారు. గతంలో ప్రారంభించిన పనుల్లో పురోగతి ఉంటుంది. వ్యాపారవేత్తలు తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు కొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. దాంపత్య జీవితంలో పరస్పర అవగాహన, అనుబంధం పెరిగే అవకాశం ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడుపుతారు. ప్రేమ జీవితం ఆహ్లాదకరంగా సాగుతుంది.

శని (6వ ఇల్లు): శని భగవానుడు ఆరవ ఇంట్లో సంచారం వలన శత్రువులపై విజయం, రోగాల నుండి ఉపశమనం , పనుల్లో పట్టుదల

బృహస్పతి (11వ ఇల్లు): లాభ స్థానంలో గురుడు సంచారం వలన ఆర్థికంగా అభివృద్ధి, ఆశించిన ధనలాభం

రాహువు ఐదవ ఇంట సంచారం వలన సంతానం విషయంలో ఆందోళన

కేతువు సంచారం వలన ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది

పరిహారం: ప్రతిరోజూ 27 సార్లు "ఓం గం గణపతయే నమః" జపం చేయాలి

నోటి దుర్వాసనతో ఇబ్బందా ? ఇంట్లోనే ఇలా మౌత్ ఫ్రెషనర్ తో బైబై చెప్పండి..

నోట్లో వాసన కలిగించే బ్యాక్టీరియా పెరిగినప్పుడు.. అలాగే పొట్టలో ఏదైనా సమస్య ఉంటే నోటి దుర్వాసన సమస్య ఎదురవుతుంటుంది. పచ్చి ఉల్లిగడ్డ, వెల్లుల్లి తినడం కూడా దీనికి మరో కారణం. ఈ సమస్యకు కచ్చితంగా మౌత్ ఫ్రెషనర్ వాడాల్సిందే. మార్కెట్ లో దొరికే మౌత్ ఫ్రెషనర్ కొనుక్కుని తెచ్చుకోవడం ఈజీనే. కానీ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండొద్దంటే మాత్రం ఇంట్లో తయారు చేసుకోవాలి. ముఖ్యంగా వంటింటి పదార్థాలతో ఈజీగా చేసుకోవచ్చు.ముందుగా సోంపు, ధనియాలు, తెల్ల నువ్వులను పావు కప్పు చొప్పున తీసుకోవాలి. అలాగే సొంఠి పొడి, దాల్చిన చెక్క పొడి, లవంగ పొడిని అర-టీ స్పూన్ చొప్పున, రెండు టేబుల్ స్పూన్ల ఇలాచీ గింజలు, పావు కప్పు ఎండు కొబ్బరి తురుము, వాము, అవిసె గింజలు, గుమ్మడి గింజలను ఒక టేబుల్ స్పూన్ చొప్పున, పావు కప్పు మిస్రీ తీసుకోవాలి. స్టవ్ పై పాన్లో సోంపు, ధనియాలు, తెల్ల నువ్వులు, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, వాము, ఎండు కొబ్బరి తురుము వేసి దోరగా వేగించి గిన్నెలో వేయాలి. అందులో పొడులు, మిస్రీ వేసి కలపాలి. దీన్ని ఎయిర్ టైట్ కంటెయినర్ లో నిల్వ చేసుకుంటే, ఆరునెలల వరకు తాజాగా ఉంటుంది.

హెల్త్

- ప్రతిరోజూ 30 నిమిషాలు నడవడం మంచిది.
- గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- శరీర బరువు నియంత్రణలో సహాయపడుతుంది.
- మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది.
- చక్కటి నిద్రకు దోహదపడుతుంది.

ఆరోగ్యం

- ఆకుకూరలను రోజువారీ ఆహారంలో చేర్చుకోండి.
- తాజా పండ్లు తీసుకోవడం అలవాటు చేసుకోండి.
- తగినంత నీరు తాగండి.
- పప్పుధాన్యాలు, నట్స్ తీసుకోండి.
- సమతుల ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వండి.

వంటకాలు

తక్కువ సమయంలో ఇంట్లోనే రుచికరమైన వంటకాలు!

- కూరగాయలతో రుచికరమైన ఉప్మా.
- పెసరపప్పుతో ఆరోగ్యకరమైన దోశలు.
- మిల్లెట్స్‌తో పోషకమైన ఇడ్లీలు.
- తక్కువ నూనెతో వెజిటబుల్ కర్రీ.
- పిల్లలకు నచ్చే పోషకాహార వంటకాలు.

వన్డేల్లో జడేజా కెరీర్ ఎండ్.. అక్షర్ మెయిన్ ఆల్‌రౌండర్.. పుజారా కామెంట్స్ వైరల్!

భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా భవిష్యత్తుపై మరోసారి తీవ్రమైన చర్చ మొదలైంది. న్యూజిలాండ్‌తో నవంబర్ 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత జట్టులో జడేజాకు చోటు దక్కకపోవడం, అతని స్థానంలో అక్షర్ పటేల్‌కే మేనేజ్‌మెంట్ ప్రాధాన్యం ఇవ్వడంపై టీమిండియా మాజీ క్రికెటర్ ఛేతేశ్వర్ పుజారా కీలక వ్యాఖ్యలు చేశాడు. జడేజా వన్డే కెరీర్ దాదాపు ముగిసిపోయిందని, వచ్చే ఏడాది జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్‌లో అక్షర్ నే ప్రధాన ఆల్‌రౌండర్‌గా బోర్డు భావిస్తోందని పుజారా విశ్లేషించాడు.

టెస్టులకే పరిమితం కాలేదు: ఛేతేశ్వర్ పుజారా

జియోస్టార్ చర్చా కార్యక్రమంలో పుజారా మాట్లాడుతూ.. రవీంద్ర జడేజా ఎంపికపై తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు తెలిపాడు. ఒకవేళ జడ్డూని వన్డేల్లో కొనసాగించాలనుకుంటే.. ఈ న్యూజిలాండ్ సిరీస్‌కే ఎంపిక చేసేవారు. అక్షర్ పటేల్ వన్డేల్లో ప్రధాన ఆల్‌రౌండర్‌గా స్థిరపడ్డాడు కాబట్టి, జడేజాకు మేనేజ్‌మెంట్ ఇప్పటికే విషయాన్ని స్పష్టం చేసి ఉంటుంది. వయసు రీత్యా ఆయనను ఇకపై కేవలం టెస్టు క్రికెట్‌కే పరిమితం కావాలని, వైట్ బాల్ క్రికెట్ (వన్డేలు, టీ20లు)లో ఛాన్స్ ఇచ్చే పరిస్థితి లేదని చెప్పి ఉంటారు.. ఇప్పటికే టీ20లకి రెస్ట్ తీసుకున్నాడు కాబట్టి, వన్డే కెరీర్‌కు కూడా ఇది ఎండ్ కార్డే అని పుజారా పేర్కొన్నాడు.

ఆపద్బాంధవుడిగా జడేజానే బ్యాకప్: అభిషేక్ నాయర్

అయితే టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్ మాత్రం పుజారా అభిప్రాయంతో పూర్తి స్థాయిలో ఏకీభవించలేదు. జడేజాను ఒక ఇన్సూరెన్స్ పాలసీలా మేనేజ్‌మెంట్ ఉంచుకుంటుందని అభిప్రాయపడ్డాడు. ద

జడేజా రెగ్యులర్ స్క్వాడ్‌లో లేకపోవచ్చు.. కానీ వన్డే ప్రపంచకప్‌కు ముందు అక్షర్ పటేల్‌కు ఏమైనా గాయమైతే.. మేనేజ్‌మెంట్ మైండ్‌లోకి వచ్చే మొదటి పేరు జడేజానే.. అక్షర్ తర్వాత టీమిండియాకు అంతటి నమ్మకమైన స్పిన్ ఆల్‌రౌండర్ వేరే ఎవరూ లేరు.. కాబట్టి జడేజా ఒక పర్ఫెక్ట్ 'ఇన్సూరెన్స్ పాలసీ'లా అందుబాటులో ఉంటాడని నాయర్ తెలిపాడు. వన్డేల్లో 200లకు పైగా వికెట్లు, 2,700 పైచిలుకు పరుగులు చేసిన 37 ఏళ్ల రవీంద్ర జడేజాను భారత్ మేనేజ్‌మెంట్ పక్కనబెట్టి, అక్షర్ పటేల్‌ను పూర్తిస్థాయిలో ప్రోత్సహించడంపై క్రికెట్ అభిమానుల్లో ఇప్పుడు మిశ్రమ స్పందన వ్యక్తం అవుతోంది.

విండీస్ చేతిలో బంగ్లాదేశ్ ఓటమి.. భారత్ కు అలా కలిసొచ్చింది!

బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. ఈ ఫలితం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) పాయింట్ల పట్టికలో టీమిండియాకు అనూహ్యంగా కలిసొచ్చింది. బంగ్లాదేశ్ ఓటమితో భారత్ ఐదో స్థానం నుంచి నాలుగో స్థానానికి ఎగబాకింది. ఢాకా సమీపంలోని షేర్-ఏ-బంగ్లా స్టేడియంలో శనివారం ముగిసిన ఈ టెస్టులో, నాలుగో రోజు వెస్టిండీస్ 170 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ అజేయంగా 81 పరుగులు చేయగా, కావెమ్ హాడ్జ్ 31 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో విండీస్ జట్టు కేవలం 35.1 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌కు ముందు, బంగ్లాదేశ్ 55.56% పాయింట్లతో నాలుగో స్థానంలో, భారత్ 51.52% పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగాయి. తాజా ఓటమితో బంగ్లాదేశ్ పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (గ్రాజు) 47.62%కి పడిపోయింది. దీంతో వారు భారత్ కంటే కిందకు, అంటే ఐదో స్థానానికి చేరారు. ఫలితంగా టీమిండియా ఎలాంటి మ్యాచ్ ఆడకుండానే నాలుగో స్థానానికి ఎగబాకింది. మరోవైపు, ఈ విజయంతో వెస్టిండీస్ పీసీటీ 20.83% నుంచి 26.92%కి పెరిగింది. ప్రస్తుతం 8వ స్థానంలో ఉన్నప్పటికీ, ఏడో స్థానంలో ఉన్న శ్రీలంక (33.33%)కు మరింత చేరువైంది. విజయం అనంతరం విండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ మాట్లాడుతూ.. "ర్యాంకింగ్స్‌లో పైకి వెళ్లే లక్ష్యంతోనే ఇక్కడికి వచ్చాం. ఈ రెండు టెస్టులు గెలిచి పట్టికలో కనీసం ఐదు లేదా ఆరో స్థానంలో నిలవాలనుకుంటున్నాం" అని తమ లక్ష్యాన్ని స్పష్టం చేశాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 272 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ షాద్మాన్ ఇస్లాం (105) సెంచరీతో ఆకట్టుకున్నాడు. విండీస్ బౌలర్ జోమెల్ వారికన్ ఐదు వికెట్లతో రాణించాడు. అనంతరం విండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ కేవలం 142 పరుగులకే కుప్పకూలింది. రోస్టన్ ఛేజ్ 5 వికెట్లు, వారికన్ 4 వికెట్లు పడగొట్టి బంగ్లా పతనాన్ని శాసించారు. స్వల్ప లక్ష్యాన్ని విండీస్ బ్యాటర్లు సులభంగా ఛేదించారు.

ఐదో టీ20కి దినేశ్ కార్తీక్ కొత్త ప్లాన్.. సంజూ, వైభవ్ ఇద్దరికీ చోటు!

న్యూజిలాండ్‌తో ఐదో టీ20లో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పించేందుకు సంజూ శాంసన్‌ను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ సూచించాడు. వైభవ్‌ను ఆడించాలనుకుంటే అభిషేక్ శర్మకు విశ్రాంతినివ్వాలని అభిప్రాయపడ్డాడు. సిరీస్‌ను భారత్ ఇప్పటికే కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ జట్టులో మార్పులు చేయవచ్చని పేర్కొన్నాడు. క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ కార్తీక్ ఈ సూచన చేశాడు. "వైభవ్ ఆడాలని అందరూ కోరుకుంటున్నారు. అతడికి అవకాశం ఇవ్వాలంటే అభిషేక్‌కు విశ్రాంతి ఇవ్వాలి. వైభవ్ గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ సంజూనే ఎందుకు తప్పించాలి? అభిషేక్‌కు కూడా విశ్రాంతి ఇవ్వొచ్చు. ఇక్కడ కీలకమైన విషయం విశ్రాంతి మాత్రమే" అని కార్తీక్ అన్నాడు. బౌలింగ్ విభాగంలోనూ మార్పులు చేయాలని కార్తీక్ సూచించాడు. అక్షర్ పటేల్‌ను కొనసాగిస్తూ అర్ష్‌దీప్ సింగ్‌కు విశ్రాంతినివ్వవచ్చని చెప్పాడు. అతడి స్థానంలో మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్‌లకు అవకాశం కల్పించవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌లో అర్ష్‌దీప్ అద్భుతంగా బౌలింగ్ చేశారని, పరిస్థితులను బట్టి అదనపు స్పిన్నర్‌ను పరీక్షించవచ్చని పేర్కొన్నాడు. గాయంతో ఇషాన్ కిషన్ రెండు, మూడో టీ20లకు దూరం కావడంతో వైభవ్‌కు జట్టులో చోటు దక్కింది. మూడో మ్యాచ్‌లో 19 బంతుల్లో 45 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కోలుకుని తిరిగి రావడంతో నాలుగో టీ20లో వైభవ్‌కు అవకాశం దక్కలేదు. ఐదో టీ20 నవంబర్ 1న హామిల్టన్‌లో జరగనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3-1తో ఆధిక్యంలో ఉంది.

యశ్ పిల్లలకు తొలి సినిమా అనుభూతి.. అది కూడా రామాయణంతోనే!

రాకింగ్ స్టార్ యశ్ కుటుంబానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. యశ్, రాధికా పండిట్ పిల్లలు అయ్రా, యథర్వ్ తమ జీవితంలో తొలిసారి సినిమా చూశారు. విశేషం ఏమిటంటే.. వారి మొదటి సినిమా అనుభవం సాధారణ చిత్రంతో కాకుండా, భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రంతో మొదలైంది. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న రామాయణం సినిమా లాస్ ఏంజెల్స్‌లో జరిగిన ప్రత్యేక ప్రీమియర్‌లో ఈ పిల్లలు సినిమాను వీక్షించినట్లు సమాచారం. అక్టోబర్ 30న యథర్వ్ ఏడో పుట్టినరోజు సందర్భంగా ఈ విషయం మరింత ప్రత్యేకంగా మారింది. అయితే పిల్లలు సినిమా చూసినప్పుడు ఎలా స్పందించారు అనే వివరాలను కుటుంబం బయటకు వెల్లడించలేదు.

ఈ సినిమాలో యశ్ రావణుడి పాత్రలో కనిపించనున్నారు. అంతేకాదు, తన సొంత నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ ద్వారా ఈ ప్రాజెక్టులో సహ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. అందుకే ఈ సినిమా యశ్ కెరీర్‌లోనే కాకుండా ఆయన కుటుంబానికి కూడా ప్రత్యేకమైన జ్ఞాపకంగా నిలిచే అవకాశం ఉంది. పిల్లల పేర్ల వెనుక కూడా ఆసక్తికరమైన అర్థాలు ఉన్నాయి. అయ్రా అనే పేరు ఐరావతి నుంచి ప్రేరణ పొందింది. ఇది లక్ష్మీదేవికి సంబంధించిన మరో పేరుగా చెబుతారు. ఇక యథర్వ్ అంటే సంపూర్ణమైనది అనే అర్థం. యశ్, రాధికా, అయ్రా పేర్లలోని అంశాలను కలిపి యథర్వ్ పేరును రూపొందించినట్లు గతంలో ఈ దంపతులు వెల్లడించారు. ఒక తండ్రి తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పాత్రలో నటిస్తున్న సినిమా.. అదే తన పిల్లలకు తొలి సినిమా కావడం నిజంగా ప్రత్యేకమైన విషయం. తరతరాలుగా భారతీయులకు పరిచయమైన రామాయణం ఇప్పుడు ఒక కొత్త తరానికి సినిమా రూపంలో పరిచయం కాబోతోంది.

స్టైలిష్ బ్లూ బ్లేజర్ దుస్తుల్లో ఆకట్టుకుంటున్న ప్రజ్ఞా నయన్



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965